## మహాకాలుని ప్రేరణ - అతి ముఖ్య సూచన

క్రాంతిధర్మీ సాహిత్యము అనే పేరుతో ప్రసిద్ధి గాంచిన ఈ పుస్తకమాల క్రాంతిదర్శీ ప్రజ్ఞాపురుషుడు పండిత శ్రీరామశర్మఆచార్య గారిద్వారా 1989 నుండి1990 మధ్య కాలములో తమ మహాప్రయాణమునకు ఒక సంవత్సరము ముందు ఒక ప్రవాహముగా సృజించబడినది. ఇరవై చిన్న చిన్న పుస్తకములుగా వున్న ఈ సాహిత్యము గురించి మన ఆరాధ్య పరమపూజ్య గురుదేవులు (పండిత శ్రీరామశర్మఆచార్యగారు) ఇలా వివరించారు – " ఇవి నా విచారక్రాంతి యొక్క బీజములు. ఇవి కొద్దిగా అయినా సరే విస్తరింపబడితే మనుష్యులను కుదిపివేస్తాయి. సంపూర్ణవిశ్వము యొక్క పటము (MAP) నే మార్చివేస్తాయి". నిజానికి ఈ పుస్తకములలో కేవలము ఆలోచనలే కాదు ఒక మహాక్రాంతి యొక్క జ్వాల లేక మంట వున్నది. యుగపరివర్తన దిశ నిర్ధారింపబడింది.

యుగఋషి తమ జీవితమంతా, జీవించేకళ నుండి నిగూఢ ఆధ్యాత్మిక విషయములు మరియు సమాజనిర్మాణము నుండి వైజ్ఞానిక–ఆధ్యాత్మిక ప్రధానమైన సమగ్ర సాహిత్యము ఏదయితే వ్రాస్తూవచ్చారో దానిని మొత్తము త్రాసులో ఒక తక్కెడలో పెట్టి రెండవ వైపు సూత్రప్రాయముగా వ్రాయబడిన ఈ పుస్తకములను పెడితే వీని బరువే ఎక్కువ. ఈ అమూల్య సాహిత్యాన్ని ఎవరైనా లాభము వద్దు, నష్టము వద్దు (NO PROFIT-NO LOSS) పద్ధతిన అచ్చుగుద్ది వ్యక్తి వ్యక్తికీ అందచేయమనే నిర్దేశము గాయత్రీపరివార్ యొక్క అధిష్టాత పరమపూజ్య గురుదేవులు స్వయముగా ఇచ్చారు. వీటిని ఎవరైనా ప్రచురణ చేయవచ్చు, ఎవరికైనా పంచవచ్చు. వీటిని ఎంత ఎక్కువమంది వ్యక్తులకు ఏ పాఠకుడు, పరిజనుడు అందచేయగలడో అతను అంత ఎక్కువ పుణ్యాన్ని పొందగలడు.


*Global Head Quarters :* **GAYATRI TEERTH**
*Shanntikunj, Haridwar, Pin- 249411*
*Phones: (01334)2460866, 2461955, 2460309*
*Phones: (01334) 2460866 E-mail : shail@del2vsnl.net.in*
*website : www.gayatripariwar.org, www.awgp.org*

In side cover page

మహాపూర్ణాహుతి పుస్తకమాల - 17

# భావ సంవేదనల గంగోత్రి

హిందీ మూలరచన :
వేదమూర్తి, తపోనిష్ఠ, యుగద్రష్ఠ
**పండిత శ్రీరామశర్మఆచార్య**
అనువాదము :
**డి.వి.ఆర్.మూర్తి, చీరాల**

ముద్రణ
**గాయత్రి చేతనా కేంద్రము**
అశ్విని హౌస్ దగ్గర, హెచ్.పి.రోడ్, మూసాపేట్,
హైదరాబాద్-500018.
ఫోన్స్ : 040-23700722, 32986922, 09392506888
E-mail : hyderabad.ap.in@awgp.org, info@aswini.com

విషయసూచిక


| | |
|---|---|
| 1. వేదవ్యాసుని అంతర్వ్యధ | 1 |
| 2. అంతర్ దృష్టి మేల్కొన్నది - చైతన్యుడు ఉదయించాడు | 10 |
| 3. మేల్కొన్న సంవేదన: నారీ చేతనను కుదిపింది | 16 |
| 4. సక్రియ సమర్పణ ఎలా ఉండాలి? | 19 |
| 5. సంకల్పము మేల్కొంటే హృదయహీనుడు మారాడు | 22 |
| 6. కార్యశూరతకు జనని - సంవేదన | 32 |
| 7. అంతరంగం జ్వలిస్తే ... | 39 |
| 8. సంవేదన ప్రసాదించిన దివ్యదృష్టి | 44 |



యుగశక్తి గాయత్రి

వ్యక్తిత్వ నిర్మాణ మాసపత్రిక

సం॥ చందా : రూ. 90/- లు    3 సం॥లకు : రూ 250/-లు

10సం॥లకు : రూ. 750/-లు    ఆజీవన చందా: రూ. 1800/-లు

పూర్తి వివరములకు

గాయత్రిమాత మందిరము మరియు ధ్యానకేంద్రము

అశ్విని హౌస్ దగ్గర, హెచ్.పి.రోడ్, మూసాపేట్, హైదరాబాద్-500018.

ఫోన్స్ : 040-23700722, 32986922, 09392506888

E-mail : hyderabad.ap.in@awgp.org, info@aswini.com




## సారాంశం


భావసంవేదన గంగోత్రి ఎండిపోయినపుడు మానవుడు నిర్దయుడుగా మారుతాడు. ఈనాడు అన్నిటికన్నా పెద్ద కరవు ఏమిటంటే - ఈ భావసంవేదన లోపమే. అవతారచేతన ఎప్పుడు దిగివచ్చినా అది ఒకే విధమైన పని చేస్తుంది - లోపలనుండి ఈ భావసంవేదనల గంగోత్రి ప్రవాహానికి ఏర్పడిన అవరోధమును తొలగించుట; సృజనకు దానిని వినియోగించుట. కొన్ని కథానికలతో, ఉదాహరణలతో ఈ యథార్థమును చక్కగా తెలియజేయవచ్చును. ఎప్పుడు మానవత్వపు గరిమ ఉదయిస్తుందో అప్పుడు ముందుగా భావచైతన్యము మేల్కొంటుం దనే యథార్థము దేవర్షి నారదుడు, వేదవ్యాసుల సంభాషణ ద్వారా స్పష్టమవుతుంది. అప్పుడే మానవుడు ఈశ్వరపుత్రుని పాత్రను పోషించగలడు. చైతన్య మహాప్రభువు వంటి అంతర్ దృష్టి సంపన్నుడైన మహాపురుషుడు సైతం శాస్త్ర తర్కమీమాంసల యుగములో ఇదే భావమును వెల్లడించారు. శ్రద్ధ వెలుగులో మానవత తాను కోల్పోయిన దానిని మరల పొందగలదు. పీతాంబర ధారియైన మీరాబాయి కరుణ విస్తారమును, మమత సందేశమును ఇచ్చుచునే ఉన్నది. సంకల్పము మేల్కొనినప్పుడు అశోకుని వంటి నిర్దయుడు సైతం మారిపోతాడు. చండ శాసనుడైన అశోకుడు మహా అశోకుడుగా మారుతాడు. జీసస్ జీవితము కరుణ సందేశము. ఈ భావసంవేదనను మేలుకొలిపిన ఒక్క సంఘటనతో గాంధీ, మహాత్మాగాంధీ అయ్యారు. జీవితాంతము చిన్న ధోవతి ధరించి పరాధీనమైన దేశమునకు స్వాతంత్ర్యమును సాధించుటలో కృతకృత్యులైరి. ఠక్కర్ బాపా జీవితంలో ఇదే విప్లవము జరిగింది. అవతార చేతన అవతరించినపుడల్లా ఇదే విధముగా మనిషిని కల్లోలపరచి అతని అంతరంగమును ఆమూలాగ్రము మార్చివేస్తుంది.

# 1. వేదవ్యాసుని అంతర్వ్యధ

"మీ ముఖముపై దుఃఖపు చిహ్నములు కనిపించుచున్న వేమి?" అని సరస్వతీ నది ఒడ్డున ఆశ్రమమునకు దగ్గరగా కూర్చుని యున్న మనీషి ముఖమండలముపై వ్యాపించిన భావములను చదువుచూ ఆగంతకుడు అడిగాడు. గడిచిన ఎన్నో దినముల నుండి ఆయన ఇచ్చట బాధాగ్రస్తుడై ఉన్నాడు. నది ఒడ్డున కూర్చుని గంటల తరబడి ఆలోచనలలో మునిగిపోవుట, శూన్యంలోకి చూస్తూ ఉండుట ఆయన దినచర్య. ఈనాడు కూడా అదే విధముగా కూర్చొని ఉన్నాడు.

వచ్చిన వ్యక్తి మాటలతో ఆయన ఆలోచనా పరంపర ఆగిపోయి, "దేవర్షీ తమరా!". ఆయన ముఖముపై ఆశ్చర్యము సంతోషము ప్రతిబింబించాయి. నారదుడు దగ్గరలో ఉన్న ఆసనముపై కూర్చుంటూ "మీరు ఎందుకు బాధగా ఉన్నారు?" అని ప్రశ్నించాడు, "బాధా నివారణ చేయువానికి బాధ, వైద్యునికి రోగము, ఎటువంటి విచిత్రమైన దశ." అని అనెను. అప్పుడు "ఇది విచిత్రం కాదు, వివశత అనండి. బాధానివారణ చేయగలిగిన వ్యక్తి తనముందు ఉన్న బాధితుని కష్టమును తొలగించుటలో సఫలత్వమును పొందప్పుడు కలిగే అంతర్వ్యథ ఇది. ఎదురుగా ఉన్న రోగిని ఆరోగ్యవంతునిగా చేయుటలో సఫలత్వము పొందని వైద్యుని మనోగత అంతర్వ్యథ ఇది." కొంచము ఆగి ఆయన గట్టిగా నిట్టూర్చి మరల సంభాషణను కొనసాగించారు. "వ్యక్తిగా,



సమాజముగా మానవుడు సన్నిపాత రోగగ్రస్తుడైనాడు. ఒకప్పుడు నవ్వుచూ, దూకుచూ ఉంటాడు. మరియొకప్పుడు అహంకారంతో మిడిసిపడుతూ ఉంటాడు. పరస్పర విశ్వాసము పోగొట్టుకున్నప్పుడు ఆచార, ఆలోచనల స్థాయి ఏవిధముగా పెరుగుతుంది? ఈనాడు కొద్దో గొప్పో కనిపిస్తున్నది శిథిలములు మాత్రమే.

"మరి కుటుంబము ......" ఇలా అంటూ ఉన్నప్పుడు ఆయన ముఖముపై పేలవమైన హాసరేఖ కనిపించింది. కళ్ళు పైకెత్తి ఎదురుగా కూర్చుని ఉన్న దేవర్షి వైపునకు చూశారు. "వీరి దశ మరీ దయనీయముగా ఉన్నది. వీరిలో మోహము మాత్రమే ఉన్నది. ప్రేమ చచ్చిపోయినది. మోహముకూడా స్వార్థము ఉన్నంతవరకే. వివాహముకాగానే పిల్లలు తల్లిదండ్రులకు తిలోదకాలు ఇచ్చివేస్తారు. ఈనాడు పద్ధతి అంతా తలక్రిందులైనది. పైకి లేచినవారిని క్రిందపడవెయ్యటం, పడిపోయిన వానిని అణగద్రొక్కివేయడము, క్రుంగిపోయినవానిని కాలితో తన్నడము - ఇదే మిగిలినది. ఈనాడు మానవునికి, పశువులకు భేదము ఆచరణ, ఆలోచనలలో కాకుండా ఆకారములో, రూపములోనే ఉంది." ఈవిధముగా చెప్పుండగా ఋషిముఖము మ్లానమయ్యెను. భావములను సంబాళించుకుంటూ నెమ్మదిగా ఋషి "దేవతగా మారాలని అనుకునే మానవుడు పశువుకన్నా హీనము అగుచున్నాడు." అన్నాడు.

"వ్యాసమహర్షీ! మీరు మనుష్యులలో మణి కిరీటము వంటి వారు." ఏదో ఆలోచిస్తూ దేవర్షి అన్నారు, "మీరు ఏప్రయత్నమూ

చేయలేదా?''

దానికి మహర్షి ''ప్రయత్నమా! .........ప్రయత్నించకుండా జీవితము ఎలా కొనసాగించగలుగుతాను? దారి తప్పిన మానవతకు దారిచూపుటకు ప్రయత్నము చేయనివాడికి, చేతులు ముడుచుకొని కూర్చున్నవాడికి, తానే మేధావిననే అహంకారములో మునిగి ఉన్నవాడికి మనిషీ అని అనిపించుకొనే యోగ్యత లేదు. అతనికి బ్రతికి ఉండే హక్కు కూడా లేదు.'' అన్నాడు.

''ఎటువంటి ప్రయత్నము చేశారు?''

''మనిషి బుద్ధిని సంస్కరించే ప్రయత్నము. దీనికొరకు వైదిక మంత్రములను వర్గీకరించి, కర్మకాండల స్వరూపమును సరిచేసితిని. మంత్రములలో నిహితమైన దివ్యమైన భావములను గ్రహించుటకు వీలుగా. కానీ.....''

''కానీ, ఏమిటి?''

''ప్రజలు మంత్రముల యొక్క ప్రాణాలను విడిచి కేవలము కర్మకాండల బాహ్యరూపానికి అతుక్కుపోయారు. అధ్యయనము చేయవలసిన వేదములు పూజా వస్తువులుగా మారాయి. ఇంతటితో ఆగినా అది అదృష్టమే. కాని వీటికి అర్థరహితమైన వ్యాఖ్యలు చేసి కుల భేదము అనే అడ్డుగోడలు కట్టసాగారు.''

''ఇంకా.......?''

''పురాణములను రచించాను. దీని ఉద్దేశ్యము, వేదములలో ఉన్న సత్యమును, సదాలోచనలను కథలద్వారా ప్రతివ్యక్తికి అందించి, తద్వారా భౌతిక బుద్ధిగత ఉన్మాదమును



శాంతింపజేయుట. కానీ.......''

''కానీ, ఏమిటి?''

''ఈ ప్రయత్నముకూడా పాక్షికముగానే ఫలించినది. సహచరులు స్మృతులను రచించారు. కాని ఇవి అన్ని బుద్ధిజీవుల జీవనోపార్జనకు సాధనములుగా తయారైనవి. జనమానసమును పూర్తిగామార్చివేసే లక్ష్యము నెరవేరలేదు. మనిషి మనసు మారలేదు. బుద్ధి మెరుగుపడలేదు. అహంభావము నశించలేదు. దాని పరిణామము మహాభారత యుద్ధము. విజ్ఞానము ధనానికి బానిస. ధనము దుర్బుద్ధి చేతి కీలుబొమ్మ. సాధనాలన్నీ వీటిచుట్టూ తిరుగుతున్నాయి. తమనుతాము జ్ఞానులు, విద్వాంసులు, తెలివిగలవారు, బలవంతులు అని భావించుకొనేవారు అందరూ దుర్బుద్ధికి దాసులయ్యారు. దేశము, సమాజముల వైభవము మరల తునాతునకలైంది. కాని నేను ఒంటరిగా ముందుకు వెళుతున్నాను, ప్రయత్నములను ఆపలేదు.'' మహర్షి గొంతులో ఉత్సాహము, దేవర్షి ముఖముపై ఉత్సుకత కనిపించెను.

కొంచెముసేపు ఆగి - ''మహాభారతరచన చేసి, మానవుని చెడు పనుల బీభత్సము వర్ణించాను. సత్కర్మల మార్గమును చూపించాను. దేనిని ఆధారముగా చేసికొని మానవుడు తనస్థితిని మెరగుపరచుకొని వృద్ధి చేసుకొనగలుగుతాడో, గడచిపోయిన దానినుండి పాఠము నేర్చుకుంటాడో - అది అంతయు వెదకి పొందుపరిచాను. కాని ఫలితము మాత్రము శూన్యము'' అన్నాడు.

''అయితే ఈ ప్రయత్నము వదులుకున్నారా మహర్షీ?'' దేవర్షి

ప్రశ్న. "లేదు. ఎందుకు వదులుకుంటాను? కర్తవ్య నిష్ఠకు మరొక పేరే మానవత్వము. మనీషి కర్తవ్యమును చివరి శ్వాస వరకు నిరంతరము నిర్వహిస్తాను."

"నిజముగా ఇదేనా నిష్ఠ అంటే?"

"అవును. మహాభారతమునకు సరియైన ప్రభావము కనిపించనందున బహుశా ఇంత విస్తృతమైన గ్రంథమును సమయాభావము వలన ప్రజలు చదువలేకపోయినారేమో అనే ఆలోచన వచ్చింది. అందువలన బ్రహ్మసూత్రమును రచించితిని. సులభమైన సూత్రములలో జీవితమును గడుపుటకు అవసరమైన తత్వములను రచించాను. ఐకమత్యము, సమత్వముల గొప్పతనాన్ని వెల్లడించాను. ఒకే ఒక పరమసత్తా ప్రతి ఒక్కరిలోనూ ఉన్నది అని చెప్పి, భ్రాతృత్వ దివ్యత్వము నీలోనూ ఉన్నది అని తెలియజేసి - తమను తాము దివ్యులుగా చేసికొనుటకు, ఉద్ధరించుకొనుటకు తగిన ప్రేరణ కూడా ఇచ్చాను. కానీ మానవ బుద్ధిని ఏమనాలి! గ్రహించే గుణము నీవు నేర్చుకొనలేదు. బుద్ధి వక్రించిన పండితాభిమానులు రకరకముల భాష్యములను వ్రాయుట ప్రారంభించారు. శాస్త్రార్థము అనే కబడ్డీ ఆడుట ప్రారంభించారు. జీవించే సూత్రముల నందించిన ఈ గ్రంథము తాలింఖానాగా తయారైనది."

"ఇప్పుడు మరల దీనిని పరిష్కరించే అన్వేషణలో ఉన్నాను. నా ప్రయత్నములు ఫలించకపోవుట నా అంతర్వ్యథకు కారణము కాదు. కాని మానవుని చెడు ఆలోచనల వల్ల కలిగిన దుర్దశను చూడలేకపోవుచున్నాను. నాలో సహించలేని అశాంతి ఉన్నది. కాని



ఏమి చెయ్యను? మార్గము తెలియుటలేదు"- అని ఆయన ఆశాభరిత దృష్టితో దేవర్షి వైపు చూడసాగారు.

"మార్గము ఉన్నది"

"ఏమిటి?" ఆయన గొంతు ఉత్సాహభరితంగా ఉన్నది. సృష్టివైభవమంతా ఒకేసారి వచ్చి కలసినట్లున్నది.

"భావసంవేదనల జాగరణ. నిద్రపోయిన ఆత్మను మేల్కొల్పుట."

"ఇంకా కొంచము స్పష్టంగా చెప్పండి."

"మీరు మానవ జీవితము యొక్క వికృతిని గుర్తించారు. ఇప్పుడు ప్రకృతిని మరింత లోతుగా గుర్తించండి. సమాధానము లభిస్తుంది."

" ప్రకృతి అంటే ఏమిటి?"

"మానవుని సమస్త కార్యకలాపములు అహంకారముతో కూడినవి. బుద్ధి, మనస్సు, ఇంద్రియములు అన్నీ దీనికి బానిసలు. మానవసత్తాకు కేంద్రము ఆత్మ. ఇది పరమాత్మశక్తి అనగా సరసత, సక్రియత, మరియు ఉదాత్త భావనల సముదాయముల సముచ్చయము యొక్క అంశము. ఆత్మజాగరణ అనగా ఉదాత్తభావనల, దివ్యసంవేదనల జాగరణ. దానిని కేవలము మేల్కొల్పుటయే గాక - గొప్ప పనులకు, దివ్యమైన జీవితము కొరకు దాని సక్రియత ఎంతో అవసరము."

"కానీ భావాలు చాలా కోమలంగా ఉంటాయి కదా." మహర్షి స్వరములో సందిగ్ధము.

"ఉండవు. ఇవి ఒకే సమయములో సుకుమారమైనవి, కఠోరమైనవి కూడా. సత్ప్రవర్తన గలవారికి ఇవి పుష్పములవలె కోమలములు, సుగంధ భరితములు. దుష్ప్రవర్తన గలవారికి వజ్రముల వలె ఒకే దెబ్బతో తునాతునకలు చేయ శక్తి గలవి. మానవులలో భావములు మేల్కొనగానే వాని మొదటిదెబ్బ అహంకారము మీద పడుతుంది. అది విరిగి చెల్లాచెదరు కాగానే, మనస్సు మరియు బుద్ధి ఆత్మను అనుసరిస్తాయి. అప్పుడు మనస్సు ఉదాత్త కల్పనలు చేస్తుంది. బుద్ధి హితకరములగు పరిష్కారములను కనుగొంటుంది. ఒకే ఒక పరిష్కారము భావసంవేదనల జాగరణ మాత్రమే. ఒక వ్యక్తిని మాత్రమే కాక, సమస్త మానవ సముదాయమును, మనస్సు, బుద్ధి రెంటినీ తప్పుదారి నుండి వెలికి తెచ్చి సన్మార్గము వైపు నడిపించే శక్తి ఒక్క భావసంవేదనలలో మాత్రమే వున్నది."

"కాని మానవ బుద్ధి చాలా విచిత్రమైనది. పొరపాటున భావముల స్థానములో కుత్స❀ భగ్గుమంటే."

"నీ అనుమానము నిరాధారము కాదు మహర్షీ! కానీ ఆ కారణముగా భయపడి వెనుకకు తగ్గవలసిన అవసరము లేదు. ఆవశ్యకము ఏమిటంటే - కర్తవ్య నిర్వహణలో జాగురూకత. లోకమునకు మేలు చేయు లక్ష్యములకొరకే కార్యోన్ముఖులమై భావసంవేదనను ఆహ్వానించాలి. భావముల అమృతాన్ని

❀ **కుత్స : నిందించుట, తప్పులు పట్టుట, అసహ్యించుకొనుట**



సదాలోచనల పాత్రలలోనే ఉంచాలి. వివేకము అనే జల్లెడతో వాటిని జల్లెడపడితే ఫలితము సుఖకరముగానే ఉంటుంది. లేఖిని ద్వారా మనిషిలో ప్రాణము నింపండి. ప్రతి వ్యక్తిలో సంవేదన, సదాశయము ఉప్పొంగునట్లు జన మానసపు లోతులను స్పృశించండి. దాని వల్ల ఆత్మచేతన ద్రవించి వ్యాకులతతో ఇలా అనాలి -

"నత్వహం కామయే రాజ్యమ్ నసౌఖ్యం న పునర్భవమ్ ।
కామయే దుఃఖ తప్తానాం ప్రాణినాం ఆర్తి నాశనమ్ ॥"

(నేను రాజ్యమును, సౌఖ్యమును, పునర్జన్మను కోరను. దుఃఖితుల వ్యథలు నశించవలెనని కోరుకుంటాను.)

"జనసముదాయపు ఆత్మ ఇంకా చనిపోలేదు. కేవలము మూర్ఛిల్లినది. ఈ మూర్ఛిల్లిన లక్ష్మణుని మేల్కొల్పి మంచి పనిలో తత్పరుణ్ణి చేసి, రామ కార్యములో నిమగ్నుణ్ణి చేయుటకు సంజీవని కావలెను. ఆ సంజీవనియే - భావసంవేదన. దానిని మీరు ఇవ్వగలరా? ఒకవేళ ఇవ్వగలిగితే నమ్మండి- స్థితి ఎంత జటిలమైనదైనా, చీకటి ఎంత దట్టముగా ఉన్నా - ఆత్మయొక్క దివ్యమైన భావముల వేగము, వెలుగు దానిని నాశనము చేయుటలో సమర్థముగలది.

"భావచేతన మేల్కొనగానే మనిషి తాను ఈశ్వరపుత్రుడనని మరల ఋజువు చేసికొనగలుగుతాడు. దివ్యజీవితము గడుపుటలో సమర్థుడనని, భూమి మీద దేవతనని, భూమిని 'స్వర్గాదపి గరీయసి' గా చేయగలనని నిరూపించుకుంటాడు. కానీ......",

అని దేవర్షి మహర్షి వైపు చూచెను.

"కానీ ఏమిటి?" వ్యాసుని ముఖములో దృఢత్వము.

మీరు నిర్మించిన సంజీవనీని పంచడానికి మీ శిష్యగణము కూడా నిమగ్నము కావాలి. మీద్వారా సృష్టించబడిన భావ మేఘములను మీ శిష్యులు వాయువువలె ధారణ చేసి ప్రతి దిశలోను, ప్రతి రంగములోను విస్తరింపజేయాలి. సుగంధమువలె ప్రతి వ్యక్తి హృదయములోను ప్రవేశించాలి. ఈ కార్యమును యుగధర్మముగా, యుగయజ్ఞముగా పరిగణించి ముందుకు సాగాలి. అప్పుడే తగిన ఫలితము లభిస్తుంది."

"శిష్యగణం తమ సర్వస్వమును ఆహుతి చేసి ఈ యుగ పరివర్తన యజ్ఞమును పూర్తి చేస్తారు." మహర్షి మాటలలో దృఢ విశ్వాసము. "ఐతే మానవ జీవితము దివ్యమగుటకు, ఈనాటి పరిస్థితులు తలక్రిందులగుటకు ఇక ఆలస్యము ఉండదు" - దేవర్షి చిరునవ్వు నవ్వారు.

"దొరికింది సమాధానము" - వేదవ్యాసుడు భావోద్వేగముతో నిండిన స్వరముతో దేవర్షికి శిరస్సు వంచి నమస్కరించాడు. ఆయన యుగ భాగవతమును రచించి శిష్యుల ద్వారా దానిని ప్రతి వ్యక్తికి చేర్చుటలో నిమగ్నమయ్యారు.

మరి నారదుడు? మరల వేరొకరి సంవేదనలను మేల్కొలుపుటకు, వారికి తగిన సమాధానములను తెల్పుటకు బయలు దేరారు.



## 2. అంతర్దృష్టి మేల్కొన్నది - చైతన్యుడు ఉదయించాడు

సమస్యలు అనేకము. కలహములు, ఆపదలు, చిక్కుల వలయము ఎంత పెద్దదంటే - దానిని బయటనుండి చూచే వారు నివ్వెరపోతారు. కాని అంతర్‌దృష్టి లభించిన వారు సులభముగా దీనికి మూలము హృదయహీనతలో ఉందని, దానిని కూకటి వ్రేళ్ళతో తొలగిస్తే తప్ప సమస్య పరిష్కారము కాదని తెలిసికొంటారు. ఈ అంతర్‌దృష్టి విశ్వంభర మిశ్రాకు లభించెను. దానితో ఆయన చైతన్య మహాప్రభువయ్యెను.

ఆరోజులలో వారు గయకు వచ్చి ఉండిరి. వారితోపాటు వారి కీర్తి కూడ వచ్చింది. వారిని చూడగనే ప్రజలు ఇలా అనుకున్నారు - "అరే! ఈయన నవద్వీపము వారుకదా. ఈయన పాండిత్యమును బెంగాలులో అందరూ గుర్తించిరి. ఇటీవల వీరు ఒక కాశ్మీరు పండితుని వాదనలో ఓడించారు. అతను చర్చ మాని పారిపోయెను. నిజానికి శాస్త్రార్థములో ఆయనకు ఎదురు లేరు"-ఈ విధముగా రకరకాల మాటలు వింటూ మిశ్రా పండితుడు మెప్పుదలల మధ్య శాంతముగానే ఉన్నాడు. ప్రశంసకుల పొగడ్తలు, నిందించేవారి కఠినోక్తులు ప్రసిద్ధిపొందిన వ్యక్తికి సంపదలు. ఇంతకంటె ఎక్కువ ఏమి ఇవ్వగలరు ఎవరైనా?

గయలో ఉన్న సాధువు ఈశ్వరపురి ఈ కథలన్నీ విన్నాడు. సాధారణముగా విన్న మాటలలో ఎక్కువ భాగము అతిశయోక్తులే

ఉంటాయి. అయినప్పటికీ, ఆయన ప్రతిభావంతుడని అంచనా వేశాడు. ఆ ప్రతిభ భావ శ్రద్ధలతో కలసినట్లయితే? ఈ ఆలోచన ఆయనను ముందుకు నడిపించింది. మార్గమధ్యములో ఇలా అలోచించుకున్నాడు - ఐతే అతడు ప్రజల జీవితాన్ని సరిదిద్దుటతో పాటు అనేక మందికి మార్గము చూపించగలడు. ప్రతిభ అనేది మనస్సు శరీరముల సక్రియతకు శిఖరాగ్రము. అది భావ శ్రద్ధలతో కలవని కారణమున అహంకారమునకు దాస్యము చేస్తుంది. విలాసము, వైభవముల వెంట పరుగులు తీస్తుంది. ప్రతిభ ఉన్నతమైన భావములతో కలసినట్లయితే స్థితి తలక్రిందు లౌతుంది. "సర్వజనహితాయ - సర్వజన సుఖాయ" కొరకు క్రియాశీలమవడానికి వివశుడిని చేస్తుంది.

దారంతా ఇదే ఆలోచన. ఎప్పుడు ఆయన గుడారము వద్దకు చేరారో తెలియలేదు. "బెంగాల్‌కు చెందిన మిశ్రాగారు ఇక్కడ ఉన్నారా?" అని ఒకరిని అడిగెను.

ప్రక్క గుడారంలో ఉన్నారని అతను చెప్పాడు.

లోపలికి వెళ్ళి చూస్తే ఒక గౌర వర్ణ యువకుడు శాస్త్ర చర్చ చేస్తున్నాడు. ఈయన కూడా ఒక మూల కూర్చున్నారు. చర్చ కొనసాగింది. చర్చ పూర్తయిన తరువాత ఆయన తప్ప అందరూ వెళ్ళిపోయారు.

చర్చిస్తున్న యువకుడు ఆయనను చూచి-

"మీ పని ఏమిటి? అని అడిగాడు.



"ఒక జిజ్ఞాస."

"చెప్పండి."

"మీకు నిజముగా శాస్త్రముయొక్క అర్థము తెలుసా?"

విన్న వ్యక్తి అంతరంగము కదిలింది. "అంటే ఏమిటి"- అని ఆయన అడిగారు.

"మరోలా అనుకోవద్దు - నా ఉద్దేశ్యము మీ వ్యాఖ్యానాలు బుద్ధి కుశలతతో కూడినవా, లేక వీటి వెనుక మీ అనుభూతులు కూడా కలసి ఉన్నవా?"

వింటున్న వ్యక్తి మౌనం వహించాడు. నేడు మొదటిసారిగా ఒకరు తన బుద్ధిని నిందించారు.

"గోరీ, గజనీ, ఐబక్ భారత భూమిని ఎంతో అణగద్రొక్కారు. భఖ్తియార్ అత్యాచారాలు బెంగాల్‌ను ఎంతగా హింసించాయో! నేటి మానవుడు ఆత్మ విశ్వాసమును కోల్పోయినాడు. తానుకూడా కొంత మంచి చేయగలను అని మరిచాడు. ఇతరుల అవినీతి, అన్యాయములను చూసి సహించటము మొదలుపెట్టాడు. వాక్చాతుర్యం మాత్రం అలవరచుకున్నాడు. ఇది విడంబన❀ కాదా" సంత్ యొక్క భావాలు మాటలుగా రూపొందాయి.

అవి మాటల పోగులు కావని, వాటి వెనుక విలవిలలాడే తపన ఉన్నదని ఆ తెల్లటి యువకుడు గ్రహించాడు. ఆయన

---

❀విడంబన : అనుసరించుట, విస్తరించుట, కూడనిది చేయుట. ఉదాహరణకు రక్షకుడు భక్షకుడగుట.

మాటలు అతని అంతరంగాన్ని మథించాయి. స్మశానములో కాలుతున్న శవాలను చూచినపుడు ఇతరులకు తమ మృత్యువు గుర్తుకు వస్తుంది. పెళ్ళివేడుకలు చూచినప్పుడు జీవితపు ఆనందము తెలుస్తుంది. ఇదేవిధముగా ఎవరి అంతరంగములో మానవాళి ఎడల తపన ఉన్నదో, ఎవరి హృదయం ఉండి ఉండి మానవత్వం కొరకు ఆక్రోశిస్తుందో, అతడే ఇతరులలో అటువంటి ఆర్ద్రతను సృష్టించగలడు. యువకుని కన్నులలో వ్యాపించిన మిథ్యా పాండిత్య తెర జారిపోసాగెను. అతడు "మీ మాట నిజమే. కాని పరిష్కారమార్గం ఏమిటి?" అని అడిగాడు.

"మానవునికి అతడు కోల్పోయిన మానవత్వాన్ని వెతకితెచ్చి ఇవ్వాలి. అతని అంతరంగపు లోతులను స్పృశించాలి. భావచేతన లేనప్పుడు, జీవించిఉన్న మనిషి కూడా శవమే. అది తాను క్రుళ్ళి, వాతావరణాన్ని కలుషితము చేస్తుంది. భావచేతన ఉంటేనే మానవుడు సమర్థుడు, సుందరుడు అవుతాడు. బాధ, పతనముల నివారణ కొరకు పరుగుతీస్తాడు. చనిపోయిన వాడిదేముంది? వాడి లక్షణం అకర్మణ్యత, హృదయహీనత. దగ్గర కూర్చున్న అతనికి వారి కరుణా విలాపం కూడ వినిపించదు. ఈనాడు నలుదిక్కులా అలాంటి మృతులే కనిపిస్తున్నారు. అలాంటివారిని తిరిగి జీవింప జేయగలవా?

"ఎలా?" "భావ, శ్రద్ధలను మేలుకొలిపి".

"కానీ సమస్యలు బుద్ధివి అయినపుడు సమాధానము కూడా



బుద్ధికి సంబంధించినదే అయిఉండాలి. ఇనుమును ఇనుమే కోస్తుంది అంటారు కదా!"

"సరిగ్గా చెప్పావు. కానీ వేడి ఇనుపముక్కని చల్లని ఇనుప ముక్క కోస్తుంది. దుర్బుద్ధి మండుతున్న ఇనుపముక్క. భావములు దీనిని మార్చి, మంచి ఆకృతిని ఇచ్చి, ఉపయోగకరముగా చేయు చల్లని ఇనుపముక్క. పరిష్కారం ఇది ఒక్కటే".

నిమాఈ ఒక్కొక్క మాటను జీర్ణించుకుంటున్నాడు. అతని నోటినుండి, "ఈనాడు శాస్త్రాల రహస్యము తెలిసినది. ఇప్పటివరకు నేను జీవచ్ఛవాన్ని, మీరు నన్ను చైతన్యునిగా చేశారు." - అనే మాటలు వెలువడినాయి. గురువు పాదధూళి తలపై ధరించాడు. గురు-శిష్యులు ఇరువురి హృదయములు సంతోషముతో నిండినవి. ఇక ఒకరి బాధ ఇంకొకరి బాధయ్యింది.

యువకుడు నదియాకు తిరిగి వచ్చాడు. అతడి జీవితములో వచ్చిన కాయకల్పమును చూచి అందరూ ' అరే ఇదేమిటీ' అని ఆశ్చర్యచకితులైరి. ఒకరోజు దారిలో ఒక కుష్టువాడు కనిపించాడు. ఉపేక్ష, తిరస్కారములతో అందరూ ముఖం త్రిప్పకొని వెళ్ళుచుండిరి. చైతన్యకు గురువుగారి ఈ మాటలు జ్ఞప్తికి వచ్చెను- "చనిపోయిన వారికి ఇతరుల శోకము వినిపించదు, ఇతరుల కష్టాలు కనిపించవు." ప్రత్యక్షముగా ఉన్నదానికి రుజువులెందుకు? నిజంగా వీరు శవాలే - అని ఆయనకు నమ్మకం కలిగింది. ఆయన

కుష్ఠువానిని లేపి, గాయాలు కడిగి, మందు తెచ్చి పూశారు. సేవా కార్యక్రమముతో పాటు జీవచ్ఛవాలలో ప్రాణము పోయుటకు భజనమండలిని ప్రారంభించారు. ఒక చైతన్యమహాప్రభువు అనేకమందిలో చైతన్యమును మేల్కొలిపారు. మేల్కొనినవారు ఇతరులలో చేతనత్వమును కలిగించారు. నిమాఈతో నితాయీ, శ్రీవాస్, గదాధర్ వంటి అనేకమంది వచ్చికలిశారు. శక సం.1455 వరకు వారి కృషి కొనసాగింది. భావ శ్రద్ధ వెలుగులోనే మానవుడు తాను కోల్పోయిన మానవత్వమును కనుగొనగలడని అందరూ అంగీకరించవలసివచ్చింది.

మానవత్వం తిరిగి దొరికింది అన్నదానికి ఒకటే గుర్తు. మనిషికోసం చనిపోయేవాడే మనిషి. అందరూ చనిపోతారు కాని జీవితమంతా ఇటుకలు, రాళ్ళు, కంకర, కాగితాలు ప్రోగుచేసుకుంటూ చనిపోతారు. వీరిని భూతాలు, ప్రేతాలు అంటే తప్పు లేదు. వీరు స్మశానములో, గోరీల్లో చోటు చేసుకొని కూర్చుంటారు. ఆ దారిన వెళ్ళేవారిని భయపెడుతూ ఉంటారు.

మనిషి అలాంటి దరిద్రపు పనులు ఎందుకు చేస్తాడు? సంవేదనా హీనుల దశ ప్రేతాల దశ. సంవేదనాశీలుర స్థితి బ్రతికున్న, మేలుకొన్న మానవుల స్థితి. వీరిలో ఎవరివలె ఉండాలి? మనం నిర్ణయించుకోవలసిన విషయము అది.



## 3. మేల్కొన్న సంవేదన :
## నారీ చేతనను కుదిపింది

మీరా జీవమున్న మనిషి అవ్వాలని నిర్ణయించుకొంది. ఆ గీటురాయి మీద తనని తాను అన్ని విధాలుగా నిరూపించుకుంది. ఆమె చిత్తూరు మహారాణి. వైభవము,పదవి,అధికారము,గౌరవము ఇంకా మనిషి కోరుకున్నవన్నీ ఆమెకు పుష్కలముగా లభించాయి. ఆమెకు లేనిది ఒకే ఒక్కటి. అదే మానవునికి హితము చేయుటకు కావలసిన అవకాశము - స్వేచ్ఛ. లోకములో చలామణి అవుతున్న బూటకపు కట్టుబాట్లతో ఆమె మరిది, ఆడపడచు, సమస్త రాజ కుటుంబం వారందరూ ఆమె ఆత్మ యొక్క గొంతు నొక్కుటలో నిమగ్నమైరి. మీరా జనంలో విప్లవ బీజాలు నాటడం, మహిళల చేతనకు వెలుగు నిచ్చే దీపంగా ముందుకు సాగటం తప్ప మిగిలిన వారికి అంతా అంగీకారమే.

ప్రేతాలకూ, మనుష్యులకూ అన్ని విషయములలోనూ వైరుధ్యమే. ప్రేతాలకు చీకటి నచ్చుతుంది. మనుష్యులకు వెలుగు నచ్చుతుంది. ఒకరికి ఇతరులను బాధించటము నచ్చుతుంది. రెండవవారికి ఇతరులకు సహకరించటం ఆనందము. మొదటి గుంపులో రెండవ వారుండటము చాలా బాధాకరమైన స్థితి. ఒకవైపు అవరోధము. మరొకవైపు లోపలి తహతహ. అశాంతి, వేదన. వీటన్నిటితో మీరా మనస్సుపై మణుగుల భారం పడింది. దానిని అనుభవజ్ఞులే అర్థము చేసికోగలరు. ఆమె రాజమహలులో ఉండికూడా ఇలా బిగ్గరగా ఏడుస్తూ ఉండేది - ఘాయల్ కిగతి

ఘాయల్ జానే కీ జిణ్ ఘాయల్ హోయ్. సూలీ ఊపర్ సేజ్ హమారీ కిస్ విధి సోవణ్ హోయ్ (దెబ్బ తిన్నవాడే దెబ్బతిన్నవాని బాధ తెలిసికోగలడు. ఈ ముళ్ళ పరుపుమీద ఎలా పరుండగలను?).

మీరా లోని అశాంతి, ఛాందసాలలో చిక్కుకున్న సమాజము గురించి. ఆమెయొక్క దుఃఖము - బాధ సమస్త స్త్రీ జాతివి. మనలో కరుణ పొంగింది అనుటకు గుర్తు ఒక్కటే, మన అవసరాలను మరచిపోయి ఇతరుల అవసరాలను గుర్తించడం. ఈ కరుణ లోపిస్తే - ఒక ఎండు చెట్టు కొమ్మను చీల్చుట, ఒక అమాయపు మనిషి మాంసమును పీక్కుతినడం, రెండూ ఒకలాగే కనిపిస్తాయి. కాని ఆమె హృదయము కరుణతో నిండిపోయింది. ఆమె బంధనాలు త్రెంచుకున్నది. రాజమహలును కాలదన్నినది. భావసంవేదనలు అనే సంజీవనిని తీసికొని, ప్రజలలో ప్రాణశక్తిని మేల్కొల్పుటకు ముందుకు నడిచింది.

ఆ రోజులలో ఆమె ఇంటి బయట ఉంది. ఇంటింటికి వెళ్ళి, స్త్రీ పురుషులు ప్రతి రంగములో సమానులు అని చాటిచెప్పినది. స్త్రీలు ఆమెను ఆశ్చర్యముతో, గర్వముతో చూచుచుండిరి. ఒక రాజస్థానీ స్త్రీ కేసరిబాయి ఆమెను ''సోదరీ! నీవు పురుషుల పనిని ఎందుకు చేయుచున్నావు'' అని అడిగెను.

''ఇది పురుషుల పనా?'' ''మరి కాకపోతే ఏమిటి?''

''నిజం చెప్పాలంటే ఇది స్త్రీల పని''. ''ఎలా?''

''ఘనమైన భావ శ్రద్ధయే మహిళ విశిష్టత. ఆమెలో ఇచ్చే



ప్రవృత్తి ఉంది. స్వార్థాలను ఇతరుల మేలు కొరకు తిరస్కరించుట ఒక్క స్త్రీకే సహజము. అందువలననే ఆమె తన ప్రాణములను ఇచ్చి బిడ్డకు జన్మ నిస్తుంది. కష్టాలను ఓర్చుకొని కుటుంబమును సంఘటితంగా ఉంచుతుంది. దీన్ని మరింతగా వ్యాప్తిచేయుట ఎంతో అవసరము''.

కేసరిబాయి సరేనన్నది. ఆమెకు యథార్థము అర్థమైనది.

ఈ ప్రయత్నాన్ని భగ్నం చేయుటకు కుట్రదారులు ప్రయత్నములు మొదలుపెట్టిరి. పాము బుట్ట, విష పాత్ర వంటి అన్నిరకముల కుతంత్రములు పన్నబడినాయి. కాని దైవీచేతన సంరక్షణ వీటన్నిటికంటే శక్తివంతమైనది. ఆమె వ్రాసుకుంది - ''ధారి మారిన మరుం, మేరో రాఖ్యా హరా జాకి'' మీ వల్ల నేను చావను, నా రక్షకుడు వేరే ఉన్నాడు.

మీరాకు ఎంతవరకు సఫలత లభించినది అనేది ప్రశ్న కాదు. వేదన, పతనముల బంధనములను త్రుంచవలెనన్న తహతహ లోపల పెల్లుబికితే పాదాలు క్రియాశీలతవైపు ముందుకు సాగితే ఈ సఫలతముందు ఎన్ని వేల సఫలతలైనా దిగదుడుపే.

విక్రమశకం 1630 వరకు ఆమె జీవించింది. జీవించి ఉన్న దంటే అర్థము ఉచ్ఛ్వాస నిశ్వాసముల చలనం కాదు. ఆరిపోయిన అనేక జీవితాలలో నూతన జ్యోతిని వెలిగించే దీపమువలె ఆమె జీవించింది. ఇంటింటికి వెళ్ళి తన వేదనను పంచింది. ప్రతిఒక్కరి అంతరాళంలో ఒక స్పందనను, ఒక తపనను రగిలించింది.

## 4. సక్రియ సమర్పణ ఎలా ఉండాలి?

వేదన జనిస్తే భోగలాలస పూర్తిగా తొలగిపోతుంది. జీవితపు పంచరంగుల కలలు, గానా బజానాలు ఆ వేదన కలవారిని ఏవిధముగాను బంధించజాలవు. అప్పుడే యవ్వనంలో అడుగిడిన ఆండాళ్ హృదయములో అటువంటి వేదన ప్రారంభమైనది. తండ్రి, బంధువులు పెళ్ళి చేసుకోమని ఒత్తిడిచేశారు. ఆమె వారిని ఈవిధముగా అడిగినది-

"వివాహము ఎందుకు?"

"కుటుంబము ఏర్పరచుకొనుటకు."

"అయితే ఇప్పుడు కుటుంబము లేదా?"

"క్రొత్త కుటుంబము ఏర్పరచుకొనుటకు".

"అంటే వివాహమునకు అర్థం క్రొత్త కుటుంబము, ఇల్లు ఏర్పరచుకొనుటయేనా?"

"అవును"

"అయితే, ఇన్ని ఇళ్ళు పాడయిపోవుచున్నపుడు, చివరికి స్వయంగా భగవంతుని ఇల్లే కుప్పకూలిపోతుంటే - క్రొత్త ఇల్లు నిర్మించుకోవాలని ఆలోచించడం ఎంత మూర్ఖత్వము? నిర్మించుకోవాలని అనుకున్నపుడు ఉన్నదానినే పద్ధతిగా నిర్మించుకోవచ్చును కదా!"

ఇంట్లో వారివద్ద దీనికి సమాధానము లేదు. కేవలము



భగవంతుడు మాత్రమే తన భర్త అని ఆమె ప్రకటించినది.

కుటుంబ సభ్యుల మనస్సులో ఆమె ఇంటిలోనే పూజలు చేసుకుంటుంది అనే రవంత ఆశ మినుకుమంటూ ఉన్నది.

కానీ విప్లవకారుల ప్రతి అడుగు అద్భుతముగా, అపూర్వముగా ఉంటుంది. ఆమె భక్తికి క్రొత్త నిర్వచనము ఇచ్చింది. ప్రపంచము కేవలము పరమాత్ముని విరాట్ స్వరూపము తప్ప మరేమీ కాదు. ఆత్మరూపములో ఆయన ప్రతిఒక్కరిలోనూ ఉన్నాడు. ఆత్మచేతనను మేల్కొల్పటం, భావసంపదను అర్పించుట - ఇదే భక్తి.

సమర్పణ నిష్క్రియంగా ఎందుకు ఉండాలి? ఆత్మచేతనకు చెందిన ప్రగాఢ భావనలలోని ప్రతి అంశము, మనస్సులోని ప్రతి ఆలోచన, శరీరము యొక్క ప్రతిక్రియా ప్రపంచము అనే ఉద్యానవనమును అందముగా, సౌకర్యముగా తయారు చేయుటకు తహతహలాడాలి. అప్పుడే సమర్పణ కార్యము మొదలైనట్లుగా తెలిసికోవాలి.

మధ్యయుగపు తొలిరోజులు అవి. తన నిరంతర కృషితో ఆమె ఆళ్వారులలో చేతనను మేల్కొల్పింది. తన భావమును స్పష్టముగా ఇలా వివరించింది. "ఎవరైతే ప్రతి వ్యక్తి బాధ తన బాధ అనుకుంటాడో"- అతడే నిజమైన భక్తుడు. లేకుంటే అతను విభక్తుడు - భగవంతునినుండి పూర్తిగా వేరుపడినవాడు. భగవంతుడు గజేంద్రుడిని కాపాడుటకు ఉత్తి కాళ్ళతో పరిగెత్తాడు.

దెబ్బతిని ఉన్న జటాయువును ఎత్తుకుని ఒడిలో కూర్చుండబెట్టు కుంటాడు. అలాగే తాను భక్తుడనని చెప్పుకునే వ్యక్తి హృదయం ఇతరుల వ్యథలకు ద్రవించకపోవడం ఎలా సాధ్యం?''

ఆళ్వారుల బృందాన్ని తీసికొని ఆమె బయలుదేరింది. తన వాణిద్వారా ప్రజల అంతరంగాలను ఉదాత్తమైన భావనలతో నింపింది.ఆమె రచనలు కూడా చేసింది. 'తిరుప్పావై' కావ్యాన్ని రచించింది. దానిలోని ప్రతి అక్షరము నుండి కరుణ ప్రవహించింది. ఈ కావ్యము ద్వారా ఆమె ఇలా చెప్పింది- మనం దేనిని శాంతి అనుకుంటామో అది క్రియాశీలతకు చరమదశ. అది పూర్తి వేగముతో తిరుగుచున్నప్పుడు బొంగరము స్థిరముగా కనిపిస్తున్న స్థితి.

కావేరినది తీర ప్రాంతములో ఆమె తన సహచరులతో కలసి విస్తృతంగా పర్యటించింది. ప్రతి ఒక్కరి అంతరంగములో నిద్రాణమై ఉన్న దివ్య భావనలను మేల్కొలిపింది. వికసింపజేసింది. భక్తి భాషలో ప్రతిఒక్కరితో ఇలా చెప్పింది- ''క్షీరసాగరము మీలోపలనే ఉన్నది. ఈ శేషశాయిని తట్టి ఊపిలేపితే నీ యిల్లు వైకుంఠమే అవుతుంది.'' విజయనగర సామ్రాజ్య స్వర్ణయుగం ఆమె అవిరళ కృషి ఫలితమే. తరువాత విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు "ఆముక్తమాల్యద'' ను రచించి ఆమెకు తన శ్రద్ధాంజలిని అర్పించాడు.



# 5. సంకల్పము మేల్కొంటే హృదయహీనుడు మారాడు

తనలోపలి దివ్యసంపదను జీవితపు ఉపరితలముపై తీసుకుని రాగలిగిన వారికే శ్రద్ధాంజలి అర్పించబడుతుంది. వారి జీవితాన్ని చూచి ఇతరుల మనస్సులలో కరుణా ప్రవాహము పొంగిపొరలుతుంది. ప్రతి ఒక్కరి జీవితంలోనూ రసహీనుడు, కరుణలేని నిర్దయుడు అనిపించుకొనే పాషాణహృదయునికి సైతం అలాంటి అవకాశము వస్తుంది.. ఆ క్షణంలో అతడు తన జీవన క్రమం మొత్తాన్ని తలక్రిందులు చేసుకుంటాడు. అంతవరకు దెబ్బతీసేవాడు, తల పగలగొట్టేవాడు ఘనీభవించిన భావరాశిగా మారి, ఇతరుల దివ్యత్వమును వెలికితీయుటలో సహాయకుడుగా రూపొందాలని సంకల్పిస్తే - ఆ క్షణము అద్భుతమైనది. ఆ సంకల్పం జరుగగానే సమ్మెట పోటుతో పదునెక్కిన ఒక్కొక్క ఉలి దెబ్బతో తన క్రూరత్వాన్ని, నిష్ఠురతను, పీడించే ప్రవృత్తిని అతడు కాలదన్నుతాడు. ఎడతెరిపి లేని, సాటిలేని ఈ తపశ్చర్య అతనిని భావాల ప్రతిమగా చేస్తుంది. ఈ విలక్షణ పరివర్తన ప్రతి ఒక్కరికీ కనిపిస్తుంది. ప్రతి ఒక్కరూ ఆశ్చర్య ఆనందములతో పరవశించి ఇలా అంటారు - ''అరే ! పరపీడన పరాయణుడు ఇప్పుడు గాయాలకు మలాంపట్టీ వేసేవాడు అయినాడే! ఈ అద్భుత కళను మనం కూడా వెళ్ళి నేర్చుకుందాము.'' అని వారు వచ్చి పువ్వులు సమర్పించి, శిరస్సు వంచి, ఆశీస్సులడుగుతారు. అందుకు

బదులుగా అతడు ఒకటే మాట చెప్తాడు.- ''నావైపు చూడు. ప్రతిక్షణము పరివర్తన పండుగ అవ్వగలదు. ఈ క్షణంనుంచి నిన్ను నీవు మార్చుకో''.

అశోకుని జీవితంలో ఇలాంటి అద్భుత క్షణం వచ్చింది. ఆరోజులలో అతడు మహా అశోకుడు కాడు, చండ అశోకుడు. కళింగ యుద్ధపు శిబిరములో ఆనాడు విజయోత్సవం జరుగుతున్నది. అహంకారము, పదవీ మదములో మునిగిన సైనిక అధికారులు అటుఇటు తిరుగుతున్నారు. అంతలో చక్రవర్తి మహాసేనాపతిని పిలిపించాడు. కొద్ది క్షణాలలోనే అతను స్వామాట్టు శిబిరములోకి వచ్చాడు. ''సేనాపతీ! యుద్ధబందీలు ఎందరు ఉన్నారు?''

''కేవలము ఒక్కరు''.

''ఒక్కరా!'' అశోకుని ఆశ్చర్యానికి అవధులు లేవు.

''మిగలిన కళింగదేశపు యువకులు, వృద్ధులు కూడా కత్తి దూశారు ప్రభూ'' - సేనాపతి సమాధానము.

''వారు కూడానా''

''అవును''

''అయితే ఇప్పుడు కళింగలో స్త్రీలు మాత్రమే మిగిలి పోయారా?''

''వారు కూడా లేరు''

''ఎందుకని?''

''చివరి యుద్ధము మేము వాళ్ళతోనే చేయవలసి వచ్చింది.''



''ఓహ్!'' అని అశోకుడు ఏదో ఆలోచనలో మునిగిపోయాడు. తరువాత అన్నాడు - ''సరే మంచిది. యుద్ధ బందీని ప్రవేశపెట్టు.''

''ఆజ్ఞ.''

కొద్దిసేపటి తరువాత ముసలి కుంటివాడు ముడతల ముఖంతో ఎదురుగా ఉన్నాడు. ''నీవేనా'' అని చక్రవర్తి అడిగాడు.

''అవును నేనే. మీకు విజయమును ఇచ్చిన బహుమతిని.'' ముసలివాని గొంతులో రోషము ఉన్నది.

''విజయ బహుమతివి నువ్వా''- అని చక్రవర్తి నవ్వాడు. ''అయితే నా వీరత్వాన్ని కళింగవాసులు ఎదుర్కొనలేక పోయినారన్నమాట. అవునా సేనాపతీ!'' అని ఆయన దగ్గర నిలచి ఉన్న సేనాపతివైపు చూచాడు. అతడు మౌనంగా ఉండిపోయినాడు.

''వీరత్వం కాదు క్రూరత్వం అనండి'' - ముదుసలి రెట్టించాడు.

''క్రూరత్వమా?''

''అవును. శవాల లోభి ఎన్నడూ వీరుడు కాడు. శవాలను చూస్తే కుక్కల, రాబందుల, నక్కల ముఖాలపై సంతోషము నాట్యమాడుతుంది. కాని వాటిని వీరులు అనలేము కదా.''

''నోరుముయ్యి'' - చక్రవర్తి హుంకరించాడు.

ముసలివాడు విషపు నవ్వు నవ్వుచూ ''ఎవరు నోరు మూసుకోవాలి? క్రూరుడా లేక దారుణమైన బాధతో ఆర్తనాదాలు చేస్తున్నవారా? నీ క్రూరత్వాన్ని వదలి యుద్ధ భూమికి వెళ్ళి చూడు. అక్కడ నాలాంటి వాళ్ళు మరి కొంతమంది దొరుకుతారు.''

''ఈ ముసలివాణ్ణి ఇక్కడినుండి తీసికొనిపొండి'' - చక్రవర్తి

కోపంతో అన్నాడు. చక్రవర్తి మాటల ప్రభావము ముసలివానిపై ఏమాత్రము పడలేదు. అతడు వెళుతూ వెళుతూ ఇలా అన్నాడు - "బాధింపబడినవారి కష్టాలను హరించి, పీడింపబడేవారి పీడను నిర్మూలించేది వీరత్వము. క్షత్రియాః త్యక్త జీవితాః. అనగా - ఎవరైతే ఇతరుల కోసం తన జీవిత వ్యామోహాన్ని త్యాగం చేస్తారో వారు వీరులు. నవ్వుతూ తుళ్ళుతూ ఉన్న జీవితాలను ఎవడు పాడుచేస్తాడో వాడు క్రూరుడు, ఉన్మాది." శిబిరములో నుండి బయటకు తీసికొని పోబడుతున్న ఆ ముసలివాని మాట అశోకుని చెవులలో సుత్తి దెబ్బవలె మ్రోగెను.

అశోకునికి రాత్రంతా అశాంతిగా గడిచింది. వీరత్వము, క్రూరత్వాల చర్చ అతని అంతరంగాన్ని వేధించసాగింది. "అయితే తాను వీరుడు కాడా! మరి వీరత్వ ప్రదర్శన కోసం చేసిన ఇదంతా ఏమిటి?" ప్రశ్న శూన్యంలో కలసిపోయింది. జవాబు లేదు.

ఉదయం లేవగానే అశోకుడు ఇలా అన్నాడు - "ఆ ముసలివాడిని పిలవండి." సైనికులు పరుగెత్తారు. కొంసేపటి తరువాత వారు ఖాళీ చేతులతో తలవంచుకుని హాజరయ్యారు.

"ఏమైంది?"

"అతడు చనిపోయాడు ప్రభూ" "అయ్యో!"

కొద్దిసేపటికి సేనాపతి వచ్చి, రాజవైద్యుడు, ఇలా చెప్పాడు - "భరింపరాని మానసిక వ్యధతో అతను మరణించాడు." అని చెప్పెను

అపరాహ్ణ వేళ చక్రవర్తి తన మంత్రులు, సైనికులు,



అధికారులతో సహా యుద్ధ భూమికి వెళ్ళాడు. అక్కడ కేవలం శవాలు, ఏనుగుల, గుర్రాల, పురుషుల, స్త్రీల తెగిన అవయవాలు ఉన్నాయి. వాటిని కుక్కలు, నక్కలు, గ్రద్దలు పీక్కుతింటూ ఆనందిస్తున్నాయి.

అశోకునికి ఉండుండి ముసలివాని మాటలు గుర్తుకు రాసాగాయి. కోట లోపలకు వెళ్లగా - అక్కడ బూడిద కుప్ప కానవచ్చింది. అయితే తాను విజయం సాధించినది శ్మశానము పైనా! తాను ఇప్పుడు ఎవరిని పరిపాలిస్తాడు - శవాల కుప్పనా? అతనిలో అశాంతి పెరిగిపోసాగింది. చక్రవర్తి అంతరంగములో నిద్రించి ఉన్న ఆత్మ చేతన ఒళ్ళు విరుచుకోసాగింది.

అతడు శిబిరానికి తిరిగివచ్చాడు. ఇప్పుడు అతని మనస్సులో ఏడు సంవత్సరముల నాటి దృశ్యములు మెదులుతున్నాయి. సోదరులతో భీషణ పోరాటం - నరసంహారము, వినాశనము, ధ్వంసము. నవ్వేవాణ్ణి ఏడిపించటం, బ్రతికిఉన్న వాడిని చంపటము, చనిపోయినవాణ్ణి త్రొక్కివేయటం - ఇదే జరిగింది ఇప్పటివరకు. ఇది ఆధారంగానే వీరుడుగా చెలామణీ అవుతూ వచ్చాడు తాను. కాని ఇప్పుడు?

శిబిరాలు పీకివేస్తున్నారు. అతడు మగధ సామ్రాజ్యం వైపు వెళుతున్నాడు. కాని మనస్సులో పరివర్తన సంకల్పము - క్రూరత్వాన్ని వీరత్వంగా మార్చాలనే సంకల్పం. అతనికి ఆ ముసలివాడు మరుపు రావటం లేదు. లక్షలాది కళింగ ప్రజల

సర్వనాశనం, ఆ రక్తపుటేరులు, గాయపడిన వారి ఆర్తనాదాలు. ఏవీ మరుపుకి రావటంలేదు. లోపల అశాంతి పెరిగిపోసాగింది.

మగధకు చేరిన తర్వాత అతడు ఆచార్య ఉపగుప్తుడిని పిలిపించాడు. ఆచార్యులు రాగానే చక్రవర్తి మొదటి ప్రశ్న - "వీరత్వం ఏది? క్రూరత్వం ఏది?

"భయంతో గజగజలాడుతున్న వారిని రక్షించడానికి, వారికి సుఖాన్ని ఇవ్వటానికి తన జీవితమునకు సైతము తిలోదకాలు ఇచ్చుటలో నిమగ్నమగుట వీరత్వము. మరి క్రూరత్వం అంటే..." అంటూ అతడు చక్రవర్తి ముఖం వైపు చూచాడు. కొంచము ఆగి చెప్పటం మొదలుపెట్టాడు. "నిర్మించిన ఊళ్ళను నాశనము చేయుట, బాగా పండి నిలిచిన పంటకు నిప్పుపెట్టుట, దోపిడీ చేయుట, పీడించుట క్రూరత్వము."

ఆ ముసలివాని మాటలకు ఈ ఆచార్యుని మాటలకు ఎంత పోలిక ఉన్నది! - అశోకుడు మనస్సులో అనుకొన్నాడు. "ఆచార్యా! నేను వీరుడను కాగలనా?" చక్రవర్తి గొంతులో పశ్చాత్తాప రేఖ.

"ఊ! ఎందుకు కాలేవు?" ఆచార్యుని వాక్కులో కోమలత్వం. "కాని ఎలా?" ఇపుడు చక్రవర్తి గొంతులో ఉత్సాహము.

"లోపలి దివ్య భావములను మేల్కొల్పి, వాటిని జీవితంలో సక్రియంగా ఆచరణ, వ్యవహారాలకు అన్వయించు."

"ఆ భావాలు మేల్కొన్నాయి అనటానికి గుర్తు ఏమిటి?"

"ఉదారమైన ఆత్మీయత. అంతా నావాళ్ళు అనే విశాల భావన. అప్పుడు ఎవరూ పరాయివాళ్ళుగా మిగలరు. ఇతరుల కష్టాలు



మనలను నిష్క్రియులుగా, సోమరులుగా ఉండనివ్వవు. కాళ్ళు అటువైపు ముందుకు సాగుతాయి. చేతులు వారి సేవలో నిమగ్నమవకుండా ఉండవు... మరొక గుర్తు ఉన్నది."

"అదేమిటి?" ఇప్పుడు గొంతులో ఉత్సుకత.

"మన జీవన సరళి సమాజపు సామాన్యమానవుని స్థాయిలో ఉందా లేదా? ఒకవేళ మనస్సులో ఏమూలనో ఇంకా వైభవం కావాలనే కోరిక, సౌకర్యములను పెంచుకోవాలనే ఆతృత ఉంటే, పెత్తనము చెయ్యాలనే, గొప్పలకుపోవాలనే మనోదశ ఉంటే - భావధార ఇంకా ప్రారంభము కాలేదని అర్థము.

"భావధార అవిరళంగా ప్రవహించుటకు ఉపాయం లేదా?"

"ఉంది. ఎందుకు లేదు?"

"ఏమిటి?"

"స్వాధ్యాయము, సత్సంగము. యుగావతారుడైన బుద్ధ భగవానుని భావామృతాన్ని ఆస్వాదించు. ఆయన ఆలోచనలకు అనుగుణంగా జీవించడం మొదలుపెట్టినవారితో సత్సంగము చేయి. రోజూ కాకపోతే వారమునకు ఒకసారి అయినా. అటువంటి పరివ్రాజకులు ఈనాడు చాల పెద్ద సంఖ్యలో తయారవుతున్నారు. వారు ఊరూరా తిరిగి జన మానసాన్ని యుగపుభావధారలతో పునీతము చేయుచున్నారు. వారి అంతరంగాన్ని స్పృశించి వారిలో సంవేదనలను మేలుకొలుపుచున్నారు."

అశోకునికి విషయం పూర్తిగా అర్థమైంది. అతని ఉత్సాహానికి హద్దు లేదు. చండ అశోకుడు ఇప్పుడు మహా అశోకుడుగా

మారుతున్నాడు. కరుణలోని దివ్యత్వం, కీర్తి కాంక్షలోని మాలిన్యం రెండూ పరస్పర విరుద్ధములు అని అతడు స్పష్టముగా గుర్తించాడు. ఒకటి ఉన్న చోట రెండవది నిలబడగలగటం అసంభవము. ఒకటి తన సామర్థ్యములోని అణువణువును ప్రజా శ్రేయస్సుకు అంకితం చెయ్యి అని ప్రేరణ నిస్తోంది. మరొకటి ఇతరుల అవసరాలను హరించి, తనకొరకు, తన పిల్లలకొరకు, తనవారికొరకు ప్రోగుచేసి ఉంచటం నేర్పుతున్నది.

అశోకునిలో మేలుకొన్న ఆత్మచేతన కీర్తికాంక్షను అతడి వ్యక్తిత్వం నుండి పారద్రోలింది. క్రూరత్వాన్ని తునాతునకలు చేసి చెత్తకుప్పలో పడవేసింది. శాంతి, సద్భావనల భావధారను ప్రవహింపజేసింది. అతడు సమస్త సామ్రాజ్యమును ప్రేమ అనే శీతల జలముతో తడపటం ప్రారంభించాడు. సామ్రాజ్య పాలనలోనే గాక అతడి వ్యక్తిగత జీవితములో కూడ మార్పు గోచరమైంది. అందరూ వద్దని చెప్పినా తన అవసరాలను బాగా తగ్గించుకున్నాడు. సమాజములో అందరికంటే పేదవాడు తన జీవితాన్ని ఎలా గడుపుతాడో అదేవిధముగా చక్రవర్తి జీవించసాగెను. చారిత్రాత్మక వివరణ ననుసరించి - అతని మొత్తము సంపద సన్యాసులు ధరించే వస్త్రాలు, ఒక సూది, తల వెంట్రుకలకు ఒక కత్తి, నీరు వడకట్టడానికి ఒక జల్లెడ, ఒక బుఱ్ఱ మాత్రమే. అతడు ఒక శిలా శాసనములో ఇలా చెప్పెను- "నేను ప్రజలందరి శుభము కొరకు పనిచేస్తాను. అందరి మేలులో నా మేలు ఉందని నేను



ఎన్నడూ మరవను. జీవన సాఫల్యమునకు ఇదే మూలసూత్రము."

ఇదంతా చేసిన తరువాత కూడా అతనికి ఒకే బాధ ఉండిపోయింది - సత్ప్రవృత్తుల వృద్ధి కొరకు నేనింకా ఏమి చేయగలను, అన్నది. ఒకనాడు ఆయన స్వయముగా ఆచార్య ఉపగుప్తుని దగ్గరకు వెళ్ళి "నేను ఇంకా ఏమి చేయాలి?" అని అడిగాడు.

బౌద్ధ సంఘ నిర్వహణ కొరకు మీ సంపదలో ఒక భాగము, సమాజపు ప్రతి వ్యక్తికి మంచి ఆలోచనల ప్రవాహమును అందించుటకు సమయమును కేటాయించు. సదాలోచనల ఈ ప్రవాహం అంతరంగాలలోని కాలుష్యాలను, కల్మషాలను క్షాళన చేసి, ఆత్మశక్తిని తట్టి మేల్కొలుపుతుంది."

"సంపద మాట సరేకానీ, నేను ముసలివాణ్ణయిపోతున్నాను. నా కుమారుణ్ణి జనచేతనను మేల్కొల్పటానికి సమర్పిస్తేనో?

"చాల ఉత్తమమైన ఆలోచన."

కుమారుడు మహేంద్రుడు, కుమార్తె సంఘమిత్ర తమ తండ్రిలోని మార్పును గుర్తించారు. దేవానాం ప్రియ అయిన అశోకుని సాత్వికతను, జనకళ్యాణముకొరకు ఆయన తపనను ఏ శక్తి వారిని నిరంతర క్రియాశీలురుగా చేసినదో దానిని అనుభూతి చెందారు.

తండ్రి ఆదర్శాల ప్రకారము నడిచే అవకాశము కుమారునికి లభించినది. అంతకంటే అదృష్టము ఏమున్నది? కుమారునికి,

కుమార్తెకు తేడా ఏమిటి? సోదరుడు చేయగలిగిన పని సోదరి ఎందుకు చేయలేదు?

సోదర సోదరీమణు లిద్దరూ సిద్ధమయ్యారు. వారిని సమాజ దేవత అర్చనకోసం సమర్పిస్తున్నపుడు ఆయన కన్నులలో కన్నీరు. అవి ఆనందబాష్పములు. చక్రవర్తి ఈ సందర్భముగా హాజరైన జనసముదాయమును సంబోధిస్తూ ఇలా అన్నారు. - “తండ్రి తన సంతానానికి వారసత్వముగా కొంత ఇస్తాడు. జీవితాంతము కూడబెట్టిన సంపాదన సంతానానికి అప్పగిస్తాడు. నేనుకూడా నా కొడుకూ, కూతుళ్ళకు నా జీవితపు సంపాదనగా నా గుండెలోని ఆవేదనను ఇస్తున్నాను. దేని ప్రచండశక్తి నన్ను అనవరతము సక్రియముగా ఉంచుతున్నదో ఆ అశాంతి ఆవేదనను ఇస్తున్నాను.”

మహేంద్ర, సంఘమిత్రల నోటినుండి ఒకేసారి “ఇటువంటి వారసత్వము పొంది మేము ధన్యులమైనాము” అనే వాక్యము వెలువడింది.

సంతానము, తండ్రి భౌతికముగా వేరయ్యారు. కాని భావముల అదృశ్య వారధి వారిని కలిపే ఉంచింది. క్రీ.పూ. 232 వరకు ఆయన జీవించి ఉన్నారు. అనంతర జీవితములో స్వయముగా సన్యసించిరి. ఇతరుల బాధ తొలగించడానికి తత్పరులై. అలాంటి ప్రేరణ ఇచ్చే సంవేదనశీలమైన జీవితమే నిజమైన వీరత్వమని తన కర్తృత్వము ద్వారా అశోకచక్రవర్తి చాటిచెప్పినారు.



## 6. కార్యశూరతకు జనని - సంవేదన

లోపల ఉన్న ఆత్మదేవత మేల్కొన్న తరువాత ఏదో ఒకటి చేయకుండా ఉండలేము. సాధనములు,సౌకర్యములు లేవు, మేము నిస్సహాయులము, అసమర్థులము అని చెప్పే సాకులన్నీ ఆ దేవత ఒళ్ళు విరుచుకోగానే పారిపోతాయి. నాజరత్ నివాసి అయిన ఏసుక్రీస్తు వద్ద ఏమున్నది! తండ్రి యూసఫ్ గ్రామములో ఒక మామూలు వడ్రంగి. తల్లి చదువురానిది. గొర్రెలకాపరుల మధ్య పెంపకము జరిగింది. ఆయన పి.హెచ్.డి, డి.లిట్ డిగ్రీలు సంపాదించలేదు. ఆత్మప్రకాశ సందేశమును అందించగలిగే గొప్పతనం ఆయనలో ఏముంది? యుగములు గడచినా ఆయన మరుగున పడలేదు. ఆయన వెలుగు విస్తరిస్తున్నది, మరింతగా విస్తరిస్తున్నది. ఎందువల్ల?

అన్ని కొరతలూ ఉన్నప్పటికీ ఆయనలో కరుణ అనే ఆంతరంగిక సంపద ఉన్నది. అందువలన స్వార్థరాహిత్యము, నిర్లోభము, త్యాగము ఆయన జీవన సహచరులు అయ్యాయి. అంతే. అదే ఆయన సర్వస్వము. ఆ బలంతోనే ఆయన రోదించే వారి కన్నీరు తుడవడం ప్రారంభించారు. దుఃఖితుల ముఖాలపై చిరునవ్వులు వెలిగించారు.

ఒక రోజున ఆయన సముద్రపు ఒడ్డున నడుస్తున్నారు. ఒడ్డున కొందరు చేపలు పట్టేవారు పోట్లాడుకోవటం చూశారు.

సంగతి ఏమిటని వారిని అడిగి తగాదాకు కారణము తెలుసుకొన్నారు. తగాదా రొట్టె గురించి అని తెలిసింది.

"అరే! ఇంతేనా! మీరందరూ మీమీ రొట్టెలను ఒకచోట పోగుచేసి, కలసి తినుట ప్రారంభించండి". అందరూ ఆయన చెప్పిన దానికి అంగీకరించారు. రొట్టెలపోగులోనుండి ఒక్కొక్క రొట్టె తీసుకుని తినసాగిరి. మధ్యలో ఆయన ప్రేమపూర్వకముగా వారికి ఇలా నచ్చచెప్పసాగిరి -" మన గురించేకాక, ఇతరుల గురించి కూడా శ్రద్ధతీసుకోవాలి. ఆకలిగొన్న ప్రతివారికి రొట్టెపై హక్కు ఉంది. కడుపునిండాక కూడా దానిని తన దగ్గర దాచి ఉంచుకోవటం అపరాధము". అందరూ తిన్న తరువాత చూస్తే ఇంకా రెండు రొట్టెలు మిగిలినాయి. ఇది ఎలా జరిగింది? అందరికీ ఆశ్చర్యము. ఆయన ఇలా వివరించారు- "వ్యక్తిగత, కుటుంబ, సామాజిక జీవితములో గల సమస్యలకు కారణము నిర్దయ (నిష్ఠురత). దాని పరిష్కార మొక్కటే - సామరస్యము. ఇది లేకపోతే సమస్యల చిక్కుముడి మరింతగా బిగుసుకుంటుంది. విప్పే మార్గమే ఉండదు." అందరూ ఒకేసారి ఆ మాటను ఒప్పున్నారు. వీరే క్రీస్తుకు మొదటి శిష్యులు.

ఆయన ఉపదేశముల, ఆయన చూపిన అద్భుతముల ఖ్యాతి పెరిగింది. అది ఎంత బాగా వ్యాప్తి అయినదంటే - ఆయన శవాలకు ప్రాణంపోస్తారు అని చెప్పుకోసాగారు. ఈ మాటలో నిజమున్నది. ఆయనవద్ద సంవేదనలతో నిండిన అమృతకలశము



ఉండేది. గుండెలోతులను సూటిగా తాకి మాటలద్వారా ఆయన ఆ అమృతాన్ని చల్లి మనుషులకు జీవం పోసేవారు.

ఒక ధనిక యువకుడు ఒకసారి ఏసుక్రీస్తును ఇలా అడిగాడు, "ప్రభూ! స్వర్గ రాజ్యం పొందటానికి ఏమి చేయాలి?" అప్పుడు ఏసుక్రీస్తు ఇలా చెప్పారు - "పవిత్రాత్మ నీలో దిగలేదు. జీవితావసర వస్తువులను తప్ప మిగిలిన సంపదనంతటనీ అమ్మివేసి. లభించిన ధనముతో ప్రతి వ్యక్తిలో ఉన్న దుఃఖాన్ని దూరంచెయ్యి. నీలోపలా బయటా స్వర్గరాజ్యము ప్రకటితమౌతుంది". ధనిక యువకుడు యిదంతా విని దిగులు చెంది, దుఃఖముతో వెళ్ళిపోయాడు. తన అపారమైన సంపదపై వ్యామోహమును అతడు వదలలేక పోయాడు. ఏసుక్రీస్తు అది విని నవ్వుతూ అందరితో ఇలా పలికెను - సూది రంధ్రములోనుండి ఒంటె దూరగలిగినా - ధనాన్ని కూడబెట్టేవాడు స్వర్గరాజ్యములో ప్రవేశము పొందలేడు."

ఏసుక్రీస్తు ఒకసారి భయపడుతూ బ్రతుకుతున్న జనులు గల గ్రామమునకు వెళ్ళాడు. వారు భయంభయంగా ఏదోవిధముగా జీవితము వెళ్ళదీస్తున్నారు. అడిగితే వివరాలు తెలిసాయి. జేకస్ అనే క్రూరుడు ఉన్నాడు. సారాయి దుకాణము నడుపుట వాడి పని. పేదలను, కూలీలను మొదట సారా త్రాగటానికి ప్రోత్సహించి తరువాత వారిని కొట్టి, తన్ని డబ్బు వసూలు చేయటము అతని అలవాటు.

దుర్వ్యసనాల వలలో చిక్కుకున్నవారి వద్ద పెట్టుబడి

ఎక్కడిది? ఒకవేళ ఉన్నా అది మెల్లిమెల్లిగా ఖాళీ అవుతుంది. పేదవానికి అది అలవాటైతే అతని కుటుంబములో శాంతి నశించిపోతుంది. కుటుంబ సభ్యులను ఆకలిదప్పులలో వదలి, వ్యసనాల కాలువలో ధనాన్ని, శారీరక శక్తిని పారబోసుకుంటాడు. జేకస్ అలాంటివారికి అప్పులు ఇచ్చి మరల నిర్దయగా వసూలుచేసుకుంటాడు. అంతేకాక చక్రవర్తి అతనికి పన్నులు వసూలు చేసే పని అప్పగించాడు. పన్నులు వసూలుచేయు సమయములో అతని రూపమే మారిపోయేది. అతను కొరడా ఝుళిపించుట చూచి జనులు ఇంట్లోకి పోయి దాక్కునేవారు. పొలాలలోకి, అడవులలోకి పారిపోయేవారు. పట్టుబడినవారు యమయాతనలను భరించవలసివచ్చేది.

కథంతా విని ఏసుక్రీస్తు తన దగ్గర ఉన్న శిష్యులవైపు చూచి ఇలా అన్నారు- "ఒకే ఒకని నిర్దయ వందలమందిని హింసించు చున్నది. విషయం అంతటితో ఆగుట లేదు. వ్యసనపరులు తమ భార్యా బిడ్డల జీవితమును నరకముగా తయారుచేయుచున్నారు. దీనికి ఒకే ఒక పరిష్కారము ఉన్నది. అతడిలో ఎలాగోలా మంచితనాన్ని నింపాలి."

"కాని, ఎలా?" శిష్యులు అడిగిరి.

"నేను స్వయముగా జేకస్ ఇంటికి పోయి, అతనిలో నిద్రించిన, ఎండి ముడుచుకుని పోయిన మానవతాసంవేదనను



మేల్కొలుపుతాను."

"తమరా!" అందరూ కళ్లు పెద్దవి చేసి ఆయనవైపు చూశారు.

"నేను కాకపోతే ఇంకెవరు?..."

ఎవరి వద్దా సమాధానం లేదు.

జేకస్‌కి ఆయన గురించి తెలిసింది. అతడు వెంటనే అడవి వైపుకి వెళ్లే కార్యక్రమము తయారుచేసుకున్నాడు. అతడికి క్రీస్తును కలవటం ఇష్టం లేదు. అయస్కాంతం వంటి ఆయన వ్యక్తిత్వాన్ని గురించి అతడు ఇప్పటికే విని ఉన్నాడు. ఏసుక్రీస్తు అతని ఇంటికి వెళ్లేసరికి అతడు అడవి వైపు వెళ్లాడని తెలిసింది. ఏసుక్రీస్తు ఎందుకు వదులుతాడు. ఆయనా బయలుదేరాడు. అతనిని వెతుకుతూ అతను ఉన్నచోటికి వెళ్లాడు. అతడు ఆయనను చూసి చాలా కంగారుపడ్డాడు. ఆయన అతనిని హృదయానికి హత్తుకున్నప్పుడు అతని కంగారు చరమదశకు చేరింది. అతడు నిశ్చేష్టుడయ్యాడు. ఆయన అతనిని చెట్టు నీడలో కూర్చోబెట్టి అతని క్రూరత్వాన్ని ఎంత కరుణరస భరితముగా వర్ణించారంటే - అతడి నిర్దయ కరిగిపోయింది. అతనితో ఆయన ఇలా అన్నారు-"కాస్త నీవు ఊహించిచూడు. ఇదే దురవస్థ నీకు, నీ స్వజనులకు చుట్టుకుంటే నీకు ఎలా ఉంటుంది?"

క్రీస్తు రెప్ప వేయకుండా అతని కళ్లలోకి చూస్తూ ఉన్నారు. జేకస్ కళ్లు దించేసుకున్నాడు. కొద్ది క్షణాల తరువాత అతడు తన

మౌనాన్ని విడచి ఇలా అన్నాడు-"ప్రభూ! ఇప్పటి వరకు నేను గ్రుడ్డివాడిని. మీరు నాకు దృష్టిని ప్రసాదించారు. నేను ఎప్పుడూ ఈ విధంగా ఆలోచించలేదు. ఈనాటి నుండి మీరు చెప్పినదే చేస్తాను. నా సంపాదన అంతా దరిద్రనారాయణుని సేవకు అర్పిస్తాను."

అసాధారణము, అద్భుతము! చెట్టు చాటున దాగి ఉన్న శిష్యులు ఇదంతా చూచి దిగ్భ్రమ చెందారు. ఆశ్చర్యచకితులై చాటు నుండి బయటకు వచ్చి ఏసుక్రీస్తును ఇలా అడిగారు - "ప్రభూ! ఈ అద్భుతం ఎలా జరిగింది?" ఆయన చిరునవ్వు నవ్వుతూ ఇలా అన్నారు - "పవిత్రాత్మ అవతరణ ద్వారా. ఈ 'హోలీ ఘోష్టు' మరొకటి కాదు. జాగృతమైన భావ సంవేదనలు. అవి కొందరిలో క్రియాశీలంగా ఉంటాయి. కొందరిలో మొద్దుబారి ఉంటాయి. మూర్ఛపోయి ఉంటాయి. మేల్కొనిన ఆత్మల బాధ్యత ఇతరులను మేల్కొల్పడము."

ఇలా చెప్పి ఆయన అతనిచేత శిలువ ధరింపజేసెను. దాని రహస్యాన్ని తెలుపుతూ ఆయన ఇలా అన్నారు - "హృదయంపై వ్రేలాడుతున్న ఈ శిలువ మా హృదయం ఆదర్శభావాలతో పూర్తిగా నిండివున్నది అనే విషయాన్ని సూచిస్తుంది. అంతేగాక - మేము దీనికోసం చావడానికి, శిలువ బాధ ఓర్చుకొనుటకు నవ్వుతూ నవ్వుతూ సిద్ధంగా ఉన్నాము అనే భావాన్ని కూడా సూచిస్తుంది."



ఆయన స్వయముగా ఆ బాధను సహించారు. శిలువపై వ్రేలాడారు. ఆ ఈశ్వరపుత్రుడు ఇలా అన్నాడు - "మేము స్వయంగా ఈ కష్టాన్ని ఓర్చుకుంటున్నాము - మీరంతా జీవించి ఉండడానికి. మీరు మీ నిర్దయను వదలి వేసినపుడే నా జీవన ఆహుతికి సార్థకత." ఆయన ఇలా అన్నారు - "ఎవరు తమ స్వార్థము కొరకు జీవిస్తారో వారు దానిని కోల్పోతారు. ఎవరు నాకొరకు తమ జీవితాన్ని త్యాగం చేస్తారో వారు దానిని పొందుతారు." మానవతా స్పందనను తన జీవితములో నిలుపుకున్న ఏసుక్రీస్తు మరణించలేదు. సూక్ష్మ రూపమునుండి విరాట్ స్వరూపుడు అయినాడు. ప్రపంచములోని 2/3 వంతుమంది ప్రజలకు ప్రభువుగా విరాజిల్లుతున్నాడు.

మన అంతరంగపు లోతులలో కూడ ఆయన దాగి ఉన్నారు. ఆయన బయటకు రావాలి అంటే పొరుగువారి బాధ మన బాధ కావాలి. ఎదుటివారి కష్టం మన మనస్సును మథిస్తే మనం ఈశ్వరునితో ఐక్యం కాబోతున్నట్లు భావించాలి. భగవంతుడు ఎప్పుడు వచ్చినా వేదన రూపంలో వస్తాడు. లోపలా బయటా మనతో ఏకం కావాలని ఆయన ఆతురత చెందుతున్నాడు. మరి ఆయన ఎలా ప్రవేశించాలి? ప్రవేశము నిషిద్ధము అని మనము బోర్డు పెట్టుకున్నాము కదా! ప్రవేశము నిషిద్ధము అనే బోర్డు మరేమీ కాదు - నిర్దయ. అది తొలగిపోగానే జీవితమంతా స్వర్గపు వెలుగుతో నిండి పోతుంది.

# 7. అంతరంగం జ్వలిస్తే ...

సంవత్సరముల తరబడి దట్టముగా ఆవరించిన చీకటిని తొలగించటానికి ఒక్క క్షణం చాలు. కాని అప్పుడు - ఒక్క అగ్గిపుల్ల వెలిగిస్తే చాలు. సంవేదనల అగ్ని జ్వలించిన క్షణంలో, శరీరములో మనస్సులో ఉన్న శక్తులన్నీ దానిని పెంచుటలోను వ్యాప్తి చెందించుటలోను నిమగ్నమైన క్షణంలో- జీవితపు చీకటి పటాపంచలౌతుంది. సమస్యలు, అవరోధములు అప్పుడు దానిని ఆర్పలేవు. అది ఇంకా ఇంకా వ్యాపిస్తూ ఉంటుంది. అలాంటివారి గురించి రవీంద్రనాథ్ టాగూర్ ''యది ఝుడి బాదలె, ఆధార్ రాతె దుఆర్ దేవధరె తబె వజ్రానలె ఆపన్ బుకేర్ పాంజర్ జ్వలియే నియే - ఏకాలా చలోరే.'' అనగా, వెలుతురు లేకపోతే, ఝంఝూవాతముతో కూడిన తీవ్ర వర్షం ఉన్న చీకటి రాత్రిలో తమ ఇంటి తలుపులు నీ కోసం అందరూ మూసివేసినా, అప్పుడు ఆ వజ్రాసనములో నీ వక్షస్థల పంజరంలో దీపము వెలిగించుకొని ఆ ప్రకాశంలో ఒంటరిగానే వెళ్ళు.

కర్మవీరుడు గాంధీజీ జీవితంలో ఒక రోజున ఇదే అగ్ని జ్వాల ప్రజ్వరిల్లింది. ఆ అగ్నిలో గౌరవ ప్రతిష్ఠలు, కీర్తి కాంక్ష , పదవి - అన్నీ కాలిపోయాయి. అప్పుడు ఆయన దక్షిణభారత యాత్ర చేస్తున్నారు. ఆఫ్రికా నుండి తిరిగి వచ్చిన తరువాత ఆయన కర్మవీరుడుగా ఖ్యాతి గడించారు. కాని అప్పటికి ఆయన మహాత్ముడు కాలేదు. దారిలో ఆయన ఒక యువతి చాలీచాలని



చీరతో తన శరీరమును కప్పుకొని ఉండుట చూచాడు. దాన్ని చీర అనుటకంటె చింకి గుడ్డలపీలిక అంటే బాగుంటుంది. బుట్ట ఎత్తుకొని వెళ్ళుచున్న ఆ యువతిని అందరూ చూచారు. ఆ చూపులలో విరక్తి, ఉపేక్ష, చెడు కోరిక - అన్నీ ఉన్నాయి. లేనిది సంవేదన ఒక్కటే. గాంధీగారు కూడా చూచారు. ఆయన దృష్టిలో కేవలము సంవేదన మాత్రమే ఉన్నది.

ఆమెను దగ్గరకు పిలిచి గాంధీజీ, ''ఏం సోదరీ! నీవు నీ చీరను ఎందుకు శుభ్రం చేసుకోవు, చిరుగులు ఎందుకు కుట్టుకోవు?'' అని అడిగారు. ఆ ప్రశ్న ఆమె భూత వర్తమానాలను, ఆర్థిక లోపములను ఒకేసారి స్పృశించినది. లోతైన గాయాలను తాకితే ఎలా బాధ కలుగుతుందో అదేవిధమైన బాధ ఆమె కన్నులలో నిండింది. ఆమె జవాబు -''రెండవ చీర ఉంటే కదా ఉతుక్కోవటము. కుట్టుకొనుటకు వీలైతే కదా కుట్టుకోవటం.''

ఆ జవాబు విని గాంధిగారి ముఖం సిగ్గుతో ఎర్రబారింది. ప్రజలు ఈ స్థితిలో ఉండగా - ప్రజా సేవకుడనని అనిపించుకొనే నేను చొక్కా ధోవతి అన్నీ అలంకరించుకున్నాను. అంతేకాదు. మరో జత నా సంచీలో ఉంది. ఇంతకంటె సిగ్గు పడవలసిన విషయం ఏముంది? అని తలచి, ఆయన మౌనముగా సంచిలో నుండి ధోవతి తీసి ఆమె వైపు చాపి ''తీసికోమ్మా! సోదరీ, మీ అన్నయ్య నుండి దీనిని స్వీకరించు'' అన్నారు.

ఆ యువతి చేయి చాపి ఆ ధోవతిని తీసుకున్నది. కృతజ్ఞతతో, ఆనందముతో ఆమె ముఖము మెరయుచుండెను.

ఆ యువతి వెళ్ళిపోయింది. గాంధీగారు తాను కట్టుకున్న పంచెను రెండు ముక్కలుగా చేసిరి. సగం కట్టుకొనుటకు సగం పైన కప్పుకొనుటకు. ఆనాటినుంచి అవే ఆయన శాశ్వత దుస్తులు అయినాయి. ఒక్క క్షణంలో కర్మవీరుడు గాంధీజీ మహాత్మా గాంధీ అయ్యారు. కేవలం బట్టలు మార్చడంవల్ల అయినారా? కాదు. అంతరంగ వ్యవస్థ తారుమారు కావడంవల్ల.

దగ్గర నిలబడ్డ స్నేహితులు ఈ విచిత్రమైన మార్పు చూశారు. కొందరు "అరె! ఇదేమిటి? మీరు పెద్దపెద్ద వారిని కలువవలసి వస్తుంది. ఈ విచిత్ర దుస్తులతో ఎలా కలుస్తారు?" అని ప్రశ్నించారు.

"సూటు బూటు ధరించి, కుక్కలను కార్లలో త్రిప్పేవారిని, నౌకర్లను తిట్టేవారిని మీరు పెద్దలని అంటారు. మీ తెలివి చూస్తే నాకు జాలి వేస్తోంది" అంటూ గాంధీగారు తీవ్రస్వరంతో ఇంకా ఇలా అన్నారు -"ఇది మీరుకాదు, మీలోని హీనత్వం మాట్లాడుతోంది. ప్రజాసేవకునికి ఏది గౌరవప్రదమో తెలియని భాష మాట్లాడుతున్నది. పెద్దలు వీరు కారు. ఎవరి మనస్సు సామాన్యుల సమస్యలకు కుమిలిపోతుందో, ఎవరి బుద్ధి ఈ సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారాలను ప్రతినిత్యము వెదుకుతుందో వారే పెద్దలు. ఎవరి శరీరం "అహర్నిశం సేవామహే" (రాత్రింబగళ్ళు సేవచేస్తాను) అనే వ్రతం స్వీకరించిందో వారే పెద్దలు. నకిలీ పెద్దరికం, నిజమైన గొప్పతనం ఈ రెండింటిలో ఏదో ఒక దానినే ఎంపిక చేయగలుగుతాము కానీ రెంటినీ కలపలేము. గొప్పతనం పొందడానికి ఒకే ఉపాయము - సామాన్య



ప్రజల బాధ తెలుసుకోవటం, దాని నివారణకొరకు సాకులు వెదకకుండా నిమగ్నమగుట". ఆయన స్నేహితులు పెత్తందారీకీ గొప్పతనానికీ మధ్యగల తేడా గ్రహించారు. "ఒకవేళ నేను బ్రిటీష్ చక్రవర్తిని కలువవలసివచ్చినా ఈ దుస్తులతోనే కలుస్తాను" అని తమ మాట ముగించారు గాంధీగారు.

ఈ సంఘటన జరిగిన కొన్ని సంవత్సరముల తరువాత నిజంగానే బ్రిటీష్ చక్రవర్తి నుండి పిలుపు వచ్చింది. పిలుపుతో పాటు గాంధీగారు బ్రిటీష్ వేషధారణతోనే రావాలనే ఆదేశం కూడా వచ్చింది. 'ఇప్పుడు ఆయన ఎలా ఇంగ్లీషు దుస్తులు ధరించరో చూద్దాం. "మహాత్మ" బిరుదు కాస్తా బూడిదపాలు అవుతుంది' - అని ఆయన విరోధులు అనుకున్నారు.

కాని గాంధీగారి మనస్సు దృఢంగా నిలచింది. 'కలుసుకోవలసిన అవసరం చక్రవర్తిది, నాది కాదు. వారికి అంగీకారమైతే నేను ఈ దుస్తులతోనే కలుస్తాను'- అని గాంధీగారు కబురుపంపారు. గాంధీగారి ఆదర్శాల ముందు చక్రవర్తి తలవంచవలసి వచ్చింది. ఐదవ జార్జి ఈయన విచిత్ర వేషాన్ని చూచి, "మీరు ఈ విధమైన వేషధారణ చేయవలసిన అవసరం ఎందుకు వచ్చింది" అని అడిగారు. గాంధీగారి జవాబు ఇది- "నిర్దయుడే వైభవాన్ని, విలాసాన్ని ప్రదర్శిస్తాడు. ఒక భావనాశీలునికి అది సాధ్యంకాదు." ఐదవజార్జి వద్ద దానికి సమాధానము లేకపోయింది.

సంవేదన తరువాతి అడుగు క్రియాశీలత. రోగికి కూడా అశాంతి ఉంటుంది. కాని అతను మంచముపై పడివుండి కాళ్ళు కొట్టుకుంటూ, మూలుగుతూ ఉంటాడు. అతని వల్ల ఏ పనీ

జరుగదు. ఇతరులే అతనికి సేవ చేయవలసి వస్తుంది. భావచేతన జాగరణతో జనించిన అశాంతి దీనికి భిన్నము. అది వ్యక్తిని క్రియాశీలునిగా మార్చి తీరుతుంది.

గాంధీ మహాత్ముని జీవితంలో ఈ క్రియాశీలతే పెరిగి వికసించింది. ఆయన తన జీవితచక్రాన్ని ఎంత వేగంగా తిప్పారంటే - ఒకేసారి అనేక పనులు చేశారు. స్వరాజ్యము, స్వావలంబన, గ్రామోద్ధరణతోపాటు ఆయన ఎంత గొప్ప పని చేశారంటే - చరిత్ర ఆయనను ఎన్నిటికి మర్చిపోదు. సమాజానికి ప్రజాసేవకులను ఇవ్వడమే ఆ పని. వినోబా, నెహ్రూ, పటేల్, కృపలాని లాంటి వందలమందిని ఆయన తయారుచేశారు. ఆయన కల ఒక్కటే రామ రాజ్యమును తెచ్చుట. అది అసంపూర్ణంగా ఉండిపోయింది. రామరాజ్యమంటే మరేదీ కాదు - ఏ సమాజములో మానవుని గుర్తింపు అతని భావ-చేతన ఆధారముగా ఉంటుందో ఆ సమాజ స్థాపన. అటువంటి సమాజ స్థాపన రానున్న రోజులలో జరుగనున్నది. సమాజపు ఈనాటి దశకు, భవిష్యద్దశకూ కాయకల్పంవంటి తేడా ఉంటుంది. ప్రతి ఒక్కరిలోనూ ఉదారమైన ఆత్మీయత పొంగిపొరలుతుంది. అటువంటి దశలో పరమార్థమే నిజమైన స్వార్థమని ఋజువౌతుంది. ఈ పరివర్తన మహోత్సవములో మనము స్వయంగా మారాలి. నిర్దయ అనే నకిలీ ముసుగును తొలగించి పారవేయాలి. సామరస్య భావన ఉప్పొంగగానే స్వర్గీయ రాజ్యము అవతరిస్తుంది. ఆ పరిస్థితులు దూరంగా లేవు.



# 8. సంవేదన ప్రసాదించిన దివ్యదృష్టి

పృథ్విపై స్వర్గావతరణ మహాకాలుని నిర్ణయము. అది మార్పు లేనిది. స్థిరమైనది. అది జరగాలి, జరిగి తీరుతుంది. నేడు మన కర్తవ్యం ఒక్కటే - మన దివ్య సంవేదనల మేలుకొలుపు. ఈ పద్ధతిని అనుసరిస్తే భావి పరిస్థితుల కనుగుణముగా మనల్ని మనము మలుచుకోగలము. దాని కొరకు ఠక్కర్ బాపా వలే చేయవలసి ఉంటుంది.

ఆనాడు ఠక్కర్ బాపా భడ్వాన్‌లో చీఫ్ ఇంజనీరు. ఆయన ఆచార వ్యవహారములు ఆయన చదువుకు తగినట్లుగా ఉండేవి. ఒకరోజున ఆయన ఇంటిని హరిజనుడు శుభ్రము చేయుచుండెను. ఎండిపోయిన శరీరము, పేలవమైన ముఖము, చిరిగిన బట్టలు అతని దీనత్వమును తెలియజేయుచుండెను. ఇంజనీర్ అమృతలాల్ ఠక్కర్ అతనికి ఇలా సలహా ఇచ్చెను - "సోదరా! పరిశుభ్రముగా ఉండు, కాస్త సరియైన బట్టలు ధరించు." ఆ హరిజనుడు ఇలా చెప్పెను - "బాబుగారూ! కోటు పాంటు ధరించటానికి నేను ఇంజనీరుని కాను". 'నీ బాధ ఏమిటి?" అని ఠక్కర్ గారు అడిగారు.

"వైభవపు గోడలమధ్య, ఆడంబరమైన కాపలాలో పేదవారి ఎక్కిళ్ళ శబ్దము వినబడదు. మా స్థితిలో ఉంటే మీకది అర్థమవుతుంది." హరిజనుడి మాటలు బాణముల వలె ఆయన గుండె లోతులలో గుచ్చుకున్నాయి. ఆయనకు తీవ్రమైన

కలవరము కలిగింది. ఈ వ్యక్తి సరిగానే చెప్పుచున్నాడు. వట్టి మాటలు ఎప్పుడు ఎవరికి మంచి చేశాయి? సంవేదనాశీలుని గుర్తింపు ఒక్కటే. అతడు ఆచరణద్వారానే చెపుతాడు. అలా కానిచో - బుద్ధి వాగాడంబరమనే క్రొత్త ముసుగు వేసుకుందని తెలుసుకోవాలి. ఇది ఎల్లప్పుడూ అప్రమాణికముగా ఉంటుంది, ఉండబోతుంది. ఉపదేశించేవాడు నేర్చుకొనేవాడితోబాటు తన అనుభూతిని మమేకం చెయ్యాలి. 'నా వాళ్ళు' అనే అనుపానం లేకుండా మహత్త్వపూర్ణమైన జీవనవిద్య ఎలా అలవరచుకోగలం?

అంతే. ఇంకేముంది - పరివర్తనపు ఘడియలు వచ్చేశాయి. ఉద్యోగాన్ని ఠక్కర్ వదిలివేశాడు. కోటు, పాంట్‌కు తిలోదకాలు ఇచ్చేశాడు, పెద్ద బంగళాను వదిలేశాడు. సంవేదనలతో నిండిన ప్రాణశక్తితో హరిజన బస్తీలోకి వచ్చి చేరాడు. ఒక శిథిలమైన గుడిసెలో ఉండసాగెను. అందరి ఇళ్ళనూ శుభ్రము చేసే హరిజనుల ఇళ్ళను ఆయన శుభ్రము చేయసాగెను. ఇప్పుడు ఆయన హరిజనులకు హరిజనుడయ్యెను. ఆ స్థితిలో సైతం ఎలా పరిశుభ్రముగా ఉండవచ్చో, మంచి సంస్కారాలను ఎలా ఏర్పరచుకోవచ్చో వారికి నేర్పాడు.

మిగిలిన సమయములో వారి పిల్లలకు చదువు చెప్పేవారు. పెద్దవారికి పుస్తకాలలో నుండి చదివి జీవితోపయోగకరమైన విషయములను వినిపించి, సరియైన పద్ధతిలో జీవించడము నేర్పించేవారు. మొదట్లో కొంత సమయము, తరువాత పూర్తి సమయము ఇచ్చి సేవలో నిమగ్నుడైన అమృతలాల్ ఠక్కర్



ఇప్పుడు అందరికీ ఠక్కర్ బాపా అయ్యాడు. దుఃఖితుల, బాధితుల వ్యథల హాలాహాలాన్ని నీలకంఠుడై త్రాగే బాపాలోని అద్భుత సంవేదనలను చూచి గాంధీజీ ఇట్లు చెప్పిరి- "బాపా లాగా సంవేదనల సంపదను కూడబెట్టగలిగితే నేను ధన్యుడనే."

దేశంలో ఏ మూలనైనా పీడిత మానవుని పిలుపు వినబడితే, బాపా మనస్సులో నివసించి ఉన్న విష్ణు భగవానునికి అది గజేంద్రుని మొరగా వినపడుతుంది. అంతే. ఆయన గరుడ వాహనాన్ని వదలి పరుగెడతారు. కరుణ అనే ప్రవాహము వారి వెంట కదలివస్తుంది.

సంవేదనాశీలునకే సరియైన దృష్టి లభిస్తుంది. మిగిలినవారు కన్నులు ఉండికూడా గ్రుడ్డివారే. వారికి మానవత్వపు కలవరపాటు కనిపించదు. బాపా వద్ద ఈ దివ్యదృష్టి ఉన్నది. బాపా అప్పుడు జైపూర్‌లో ఉండిరి. ఆ నగరాన్ని "భారతదేశపు పారిస్" అనేవారు. వారికి అక్కడి హరిజనుల నరకయాతన కనిపించినది కాని అక్కడి విలాసములు కనిపించలేదు. ఆయనలోని అణువణువు ఈ దీనుల, హీనుల బాధతో ద్రవించింది. ఆయన రంగములో దూకిరి. ప్రజా సహకారము పొంగిపొరలెను. అచ్చటి హరిజనుల దశ మెరుగుపడింది.

కిషోర్‌లాల్ మష్రూవాలా మాటలలో "బాపా సంవేదనలు ఆకర్షణలో బంధింపబడి హరి ఆయన వద్దనే నడయాడెను." బాపా మాటలలో "నా హరి దీనుల, దళితుల గుడిసెలలో ఉంటాడు. అతనితో నేను మమేకమై పోయాను." ఒకనాడు బాపా ఢిల్లీలో

ఒక హరిజనుని ఇంటిలో కూర్చొని ఈ గుజరాతి భజనను పాడుచుండిరి -

**హరినా జనతో ముక్తి న మాంగే మాంగే జన భోజనమ్ అవతర్ రే।**
**నితసేవా నిత కీర్తన్ ఓచ్ఛ వ నిరఖవా నందకుమార్ రే ॥**

అక్కడ ఉన్న వియోగి హరి ఇట్లు అడిగెను - "మీరు చూశారా నందకుమారుని?" ఆయన భావ విహ్వలుడై పలికెను - "ఎందుకు చూడలేదు? నందకుమారుని దర్శనము నేను ఎన్నో రూపాలలో చేసుకున్నాను - ఆదివాసులలో, హరిజనులలో, గోకులములో."

నందకుమారుని దివ్యలోకము మరల భూమిపై అవతరించుటకు త్వరపడుచున్నది. మనము కూడా అదే వేదనతో సంవేదనలను మేల్కొలిపి, దివ్యదృష్టిని పొందాలి. అలా చేయనిచో మనము గుడ్డివారిలా తడుముకుంటూ తిరుగవలసి వస్తుంది. ఈ స్థితి నుండి తప్పించుకొని, మనము భావసంవేదనల రాజ్యములో నివసించుటకు యోగ్యలమౌదాము. ఈ క్షణమే మన ఆత్మ జాగృతి క్షణము కావాలి.

మహాపూర్ణాహుతి పుస్తకమాల – 17

# భావ సంవేదనల గంగోత్రి

ప్రథమ ముద్రణ : **2000 ప్రతులు**
**2008 - ఉగాది**

మూల్యము :

ప్రకాశకులు : హిందీ: **యుగనిర్మాణయోజన, గాయత్రీ తపోభూమి,** మథుర

ముద్రణ మరియు ప్రతులకు :

**గాయత్రి చేతనా కేంద్రము**
అశ్విని హౌస్ దగ్గర, హెచ్.పి.రోడ్, మూసాపేట్, హైదరాబాద్–500018.
ఫోన్స్ : 040–23700722, 32986922, 09392506888
E-mail : hyderabad.ap.in@awgp.org, info@aswini.com

## క్రాంతిధర్మీ సాహిత్యము యొక్క 20 పుస్తకములు

1.ఇరవైఒకటవ శతాబ్ది – ఉజ్జ్వలభవిష్యత్ – 1 (ఇక్కీస్వీసదీ బనామ్ ఉజ్వలభవిష్య్-భాగ్1)
2.ఇరవైఒకటవ శతాబ్ది – ఉజ్జ్వలభవిష్యత్ – 2 (ఇక్కీస్వీసదీ బనామ్ ఉజ్వలభవిష్య్-భాగ్2)
3.యుగేచ్ఛ – ప్రతిభా పరిష్కారము – 1 (యుగ్ కీ మాంగ్ ప్రతిభాపరిష్కార్-భాగ్1)
4.యుగేచ్ఛ – ప్రతిభా పరిష్కారము – 2 (యుగ్ కీ మాంగ్ ప్రతిభాపరిష్కార్-భాగ్2)
5.సత్యయుగ పునరాగమనము (సత్‌యుగ్ కీ వాపసీ)
6.పరివర్తన యొక్క గొప్ప క్షణములు (పరివర్తన్ కే మహాన్ క్షణ్)
7.జీవన సాధన యొక్క స్వర్ణిమసూత్రములు (జీవన్ సాధనాకే స్వర్ణిమ్ సూత్ర్)
8. ప్రతిభల కొరకు మహాకాలుని ఆహ్వానము (మహాకాల్ కా ప్రతిభావోం కా ఆమంత్రణ్)
9. ప్రజ్ఞావతారము యొక్క విస్తారప్రక్రియ (ప్రజ్ఞావతార్ కీ విస్తార్ ప్రక్రియా)
10. నవసృజనము కొరకు మహాకాలుని ఏర్పాట్లు (నవసృజన్ కే నిమిత్త్ మహాకాల్ కీ తైయారీ)
11. నేటి సమస్యలకు రేపటి సమాధానము (సమస్యాయే ఆజ్ కీ సమాధాన్ కల్ కీ)
12. మనఃస్థితి మారితే పరిస్థితులు మారతాయి (మనఃస్థితి బదలే తో పరిస్థితి బదలే)
13. ప్రఖరప్రజ్ఞ – స్రష్ట యొక్క పరమ అనుగ్రహము (స్రష్టా కా పరమ్ ప్రసాద్ ప్రఖర్ ప్రజ్ఞా)
14. ఆద్యశక్తి గాయత్రి యొక్క సమర్థసాధన (ఆద్యశక్తి గాయత్రీ కీ సమర్థ్ సాధనా)
15. శిక్షే కాదు విద్య కూడా (శిక్షా హీ నహీ విద్యా భీ)
16. సంజీవనీ విద్య యొక్క విస్తరణ (సంజీవనీ విద్యా కా విస్తార్)
17. భావసంవేదనల గంగోత్రి (భావ్ సంవేదనాఓం కీ గంగోత్రీ)
18. మహిళా జాగృతి అభియానము (మహిలా జాగృతి అభియాన్)
19. జీవన దేవతా సాధన – ఆరాధన (జీవన్ దేవతా కీ సాధనా – ఆరాధనా)
20. సమయదానమే యుగధర్మము (సమయదాన్ హీ యుగ్ ధర్మ్)